


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 24-07-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 273 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## శ్రీవారిని దర్శించుకున్న ఏపీ నూతన గవర్నర్ హరిచందన్



తిరుమల: ఏపీ నూతన గవర్నర్‌గా నియమితులైన బిశ్వభూషణ్ హరిచందన్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ముందుగా వరాహస్వామిని దర్శించుకున్న ఆయన.. అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. శ్రీవారి ఆలయం వద్ద తితిదే అధికారులు బిశ్వభూషణ్‌కు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత తరువాయి 2లో..

## విజయసాయిరెడ్డితో ఐఏఎస్ శ్రీలక్ష్మి భేటీ



దిల్లీ: దిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డితో సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి భేటీ అయ్యారు. తెలంగాణ నుంచి ఏపీకి తనను డిప్యుటేషన్‌పై తరువాయి 2లో..

# సభలో సంకుల సమరం

- 45 ఏళ్లకే పింఛను విషయంపై రగడ
- ఎన్నికల హామీపై స్పష్టతకు తెదేపా డిమాండ్
- మాట్లాడేందుకు సమయంకోరిన చంద్రబాబు
- ముగ్గురు తెదేపా ఎమ్మెల్యేల సస్పెన్షన్
- అచ్చెన్నాయుడు, రామానాయుడు, బుచ్చయ్య చౌదరి



అమరావతి: ఏపీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం శాసనసభ వాడివేడిగా ప్రారంభమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు 45 ఏళ్లకే పింఛను విషయంలో తలెత్తిన ప్రశ్న కారణంగా ముగ్గురు తెదేపా ఎమ్మెల్యేలు సస్పెన్షన్‌కు గురయ్యారు. ప్రశ్నోత్తరాల సమయంలో వైకాపా ఎన్నికల హామీపై స్పష్టతకు తెదేపా సభ్యుడు రామానాయుడు డిమాండ్ చేశారు. అయితే మేనిఫెస్టోలో అలాంటి హామీ ఇవ్వలేదని పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి జగన్ జోక్యం చేసుకున్నారు. ఎన్నికల సమయంలో తాను మాట్లాడిన వీడియోను సభలో ప్రదర్శించారు.

దీనిపై స్పందించిన తెదేపా సభ్యులు తమ వద్ద ఉన్న వీడియోను ప్రదర్శించేందుకు అనుమతి కోరారు. దీనికి ప్రభుత్వం తరువాయి 2లో..

## హామీలు అమలుచేయమంటే సస్పెన్షన్ చేస్తారా?



### సస్పెన్షన్ అప్రజాస్వామికం ప్రతిపక్షం నోరునొక్కుతున్నారు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకటరావు

అమరావతి: తమ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలను శాసనసభ నుంచి సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకటరావు మండిపడ్డారు. ప్రజల కోసం ప్రశ్నిస్తే సభ నుంచి సస్పెండ్ చేస్తారా అని ప్రశ్నించారు. ముగ్గురు తెదేపా సభ్యులపై తరువాయి 2లో..

## ప్రభుత్వంపై అసహనం పెరుగుతోంది



### రాష్ట్రమంతా అభద్రతా భావం వచ్చింది ప్రతిపక్షనేత చంద్రబాబు

అమరావతి: ముందస్తు ప్రణాళికలో భాగంగానే ఒక బీసీ నాయకుడిని సస్పెండ్ చేసి బీసీ బిల్లు ప్రవేశ పెట్టారనే విషయం అర్థమవుతోందని తెదేపా అధినేత, ప్రతిపక్ష నేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. తెదేపా శాసనసభాపక్ష ఉపనేతలు అచ్చెన్నాయుడు, బుచ్చయ్య చౌదరి, నిమ్మల రామానాయుడును అకారణంగా సస్పెండ్ చేస్తే సభలో తాము ఖాళీగా ఎలా కూర్చుంటామని తరువాయి 2లో..

### మహిళలకు 50శాతం రిజర్వేషన్

## చారిత్రాత్మక నిర్ణయం



అమరావతి: నామినేటెడ్ పదవులు, ప్రభుత్వం చేపట్టే కాంట్రాక్టు పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనదని వైకాపా ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సహా మహిళలకు ఉద్దేశించిన బిల్లులపై శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా రోజా మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అన్ని రాష్ట్రాలూ మనవైపే చూస్తున్నాయని ఆమె కొనియాడారు. 40 ఏళ్ల అనుభవం అని చెప్పుకునే వ్యక్తులకు ఇలాంటి ఆలోచనలు ఎందుకు రాలేదని పరోక్షంగా తరువాయి 2లో..

## వినతుల పరిష్కారంలో పురోగతి

### జిల్లా కలెక్టర్లతో సీఎం జగన్ టెలీకాన్ఫరెన్స్

అమరావతి : స్పందన కార్యక్రమానికి వచ్చే వినతుల పరిష్కారంలో పురోగతి కన్పిస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్పందన కార్యక్రమంపై కలెక్టర్లు, ఎస్పీల, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేపట్టారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌తోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, డీజీపీ గౌతం సవాంగ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజల నుంచి వినతులు వస్తే పరిష్కారం అవుతాయన్న నమ్మకాన్ని అధికారులు కలిగించారని పేర్కొన్నారు. కలెక్టర్లకు, ఎస్పీలకు అధికారులకు సీఎం అభినందలు తెలిపారు. జూలై 12 వరకు 59 శాతం పిటిషన్లు పెండింగ్‌లో ఉంటే.. ఆ సంఖ్య జూలై 19 నాటికి 24 శాతానికి తగ్గిందని తెలిపారు. ఎమ్మార్వో, సబ్ రిజిస్ట్రార్ , మున్సిపల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌లలో అవినీతి కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో పనిచేయని మురుగునీటి శుద్ధిప్లాంట్లు, మినరల్ వాటర్ ప్లాంట్లను గుర్తించాలని సీఎం సూచించారు. నిర్మించి వాడుకలో లేకపోతే ప్రజాధనం వృథా అయినట్టేనని తెలిపారు. ఇసుక సరఫరాపై దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

#### పశ్చిమలో ట్రాకింగ్ బాగుంది

ఈ సమీక్షలో సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ‘ ప్రజల నుంచి వచ్చే వినతుల తరువాయి 2లో..

## ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు




విశాఖ సిటీ రూరల్: సిపిఐ మావోయిస్టులు ఏ.సీ.ఎం,లు ఇద్దరు , దళం మెంబర్ ఒకరు , నలుగురు హార్డ్ కోర్ మిలీషియా సభ్యులు మొత్తం ఏడుగురు మంగళవారం విశాఖపట్నం రేంజ్ డి.ఐ.జి కాళిదాసు వెంకట రంగారావు మరియు విశాఖపట్నం జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ వారి ముందు జిల్లా పోలీసు కార్యాలయంలో స్వచ్ఛంధంగా లొంగిపోయారు. ఈ విషయమై స్థానిక ఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రేంజ్ డిఐజి కాళిదాసు వెంకట రంగారావు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు నచ్చక, నాయకుల ఒంటెద్దు పోకడలకు విసిగి, గిరిజనులుకాని వారి నాయకత్వం ఇష్టంలేక మరియు ఆనారోగ్య సమస్యలు, కుటుంబంతో కలిసి జీవించాలని, తరువాయి 6లో..




## ఏపీలో సామాజిక విప్లవం..

అమరావతి: ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సామాజిక విప్లవానికి నాంది పలుకుతూ.. చరిత్రాత్మక బిల్లులను ఏపీ శాసనసభ మంగళవారం ఆమోదించింది. రాష్ట్రంలోని బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలు, మహిళలకు అన్ని రంగాల్లో చేయూతనందిస్తూ.. అన్ని విధాలుగా మేలు చేస్తూ రూపొందించిన కీలకమైన బిల్లులు అసెంబ్లీ ఆమోదంతో చట్టరూపం దాల్చాయి. ఇది ఆయా వర్గాల వారికి ఒక సుదినం. సువర్ణ అధ్యాయం. నామినేటెడ్ పదవుల్లో, నామినేషన్ పనుల్లో 50 శాతం రిజర్వేషన్లను మహిళలకు కల్పిస్తూ తీసుకువచ్చిన చరిత్రాత్మక మహిళా సాధికారిత బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. జనాభాలో సగం ఉన్న మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఈ బిల్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ బిల్లు ప్రకారం అన్ని కార్పొరేషన్లు, సొసైటీ పదవుల్లో, బోర్డులు, కమిటీల చైర్‌పర్సన్ పదవుల్లో మహిళలకు సగం పదవులు దక్కనున్నాయి.

ఇక సామాజికంగా వెనుకబడిన బీసీలకు బాసటగా నిలుస్తూ.. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారు తీసుకొచ్చిన శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు బిల్లు సైతం ఆమోదం పొంది చట్టరూపం దాల్చింది. రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో, పనుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఇప్పటికే సభ ఆమోదించిన సంగతి తెలిసిందే. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మేరకు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. వర్క్, సర్వీస్ కాంట్రాక్టుల్లోనూ ఈమేరకు 50శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. చాలా గొప్ప విషయం..

నామినేషన్ పనుల్లో, పదవుల్లో మహిళలకు 50శాతం? రిజర్వేషన్ కల్పించడం చాలా గొప్ప విషయమని వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కొనియాడారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుపై చర్చ తరువాయి 2లో..



# ఎల్ అండ్ టి దత్తతో దశ మారిన జుత్తాడ గ్రామం

## లక్షలాధి రూపాయలతో అభివృద్ధి పనులు



చోడవరం: మండలంలోని జుత్తాడ గ్రామాన్ని లార్సన్, టర్బో లిమిటెడ్(ఎల్.అండ్.టి)డిఫెన్సు ఇంజనీరింగ్ కంపెనీ దత్తత తీసుకోవడంతో దశ మారుతుంది. గ్రామాన్ని దత్తత తీసుకుని లక్షలాధి రూపాయలతో అభివృది్ధ పనులు చేపడుతుండటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఇప్పటికే మొదటి విడతగా సుమారు 17 లక్షల రూపాయలతో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మాణం, ఫర్నీచర్, విద్యార్థులు భోజనం చేసేందుకు డైనింగ్ హాలు, వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టగా, గ్రామంలో 18 లక్షల రూపాయలతో ఆసుపత్రి, గ్రామస్తులకు సురక్షిత నీటిని అందించేందుకు 16 లక్షలతో వాటర్ ప్లాంట్‌ను ఇప్పటికే నిర్మాణం చేపట్టగా, సుమారు 9 లక్షల రూపాయల నిధులతో ఆటోమేటిక్ సోలార్ వీధి దీపాలను మంగళవారం ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో విద్యుత్ అవసరం లేకుండానే సౌర విద్యుత్ దీపాలు వెలుగులు ప్రసరించనున్నాయి. కాగా రెండవ విడతగా 35 లక్షల రూపాయలతో రక్షిత మంచినీటి పథకం, పార్కు అభివృద్ధి, గ్రంథాలయ భవణం నిర్మాణం,ఉచిత వైద్య శిభిరాలు నిర్వహించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయడం పట్ల తాజా మాజీ సర్పంచ్ మళ్ళ అప్పల సత్యనారాయణ, పీలా వెంకట గణేష్, మళ్ళ శ్రీనివాసరావు, జామి పట్టాభిరామ్, దొడ్డి రమేష్, దొడ్డి నాయుడు, బుద్దా మాలినాయుడు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# మౌలిక సదుపాయం కొరతతో అవస్తలు పడుచున్న గిరి గ్రామాలు



అనంతగిరిః మండలం ,లొంగుపర్తి పంచాయతీ పరిధిలోగల మెట్టువలస ఎర్రమెట్టు ఓనుకొండ నేలపాలెం వంతెనగారు. వెలగలపాడు గ్రామాలలో పోడు భూములు లకు పట్లాలు మరియు మంచి నీరు రోడ్డు వీధి లైట్స్ సీసీ రోడ్డు వంటి సమస్యలు ఉన్నాయని ఆయాగ్రామాలకు కనీస మౌలిక సదుపాయం లేదని ఈ గ్రామాలు మండల కేంద్రాల్లో 20 పనిచేయని ఏటీఎం అవస్థలుపడుతున్న ప్రజలు, అనంతగిరి ,మండలంలో ఆంధ్రాబ్యాంక్ పని చేయక పోవడం వలన మండలంనకు వచ్చే ప్రజలు పర్యాటకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఒకేఒక ఏటీఎం దిక్కు. దీనికి తప్పితే 30 కిలోమీటర్ దూరంలో అరకు వేలి లేదా శృంగవరపుకోట చేరితే తప్ప ఏటీఎం ఇంకె క్కడా అందుబాటులో లేదు. దీనితో అనంతగిరి మండలం నకు చెందిన ప్రజలు పర్యాటకులు చాలా అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

## ఆగస్టు 1 నుంచి భూములకు కొత్త విలువలు

***నర్సీపట్నం ఆర్డీవో గోవిందరావు***



నర్సీపట్నం : పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో గల భూముల విలువలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మార్కెట్ విలువ రివిజన్ గైడ్‌లైన్స్ ప్రకారం ఆగస్టు ఒకటో తేదీ నుండి అమల్లోకి తీసుకురావాల్సి ఉంటుందని నర్సీపట్నం ఆర్డీవో ఆర్.గోవిందరావు తెలిపారు. మంగళవారం ఉదయం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో నర్సీపట్నం డివిజను 10 మండల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సబ్ రిజిస్ట్రార్లతో మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ హోదాలో ఆర్డీవో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రివిజన్ మార్కెట్ వ్యాల్యూ గైడ్లెన్స్ ప్రకారం 1998 ప్రకారం మార్కెట్ విలువలు మారనున్నాయని, ఈ సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుండి ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రివిజన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా ఆర్డీవో వ్యవహరిస్తారని, సంబంధిత మండల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జిల్లా రిజిస్ట్రార్‌లు సభ్యులుగా వ్యవహరిస్తారన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మార్కెట్ విలువలను 10 శాతం వరకు పెంపుదల చేస్తూ కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ విలువలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్నాయన్నారు. మార్కెట్ విలువలకు సంబంధించి డేటా ఎంట్రీ వెరిఫికేషన్ చేసి అన్ని జిల్లాలలోనూ, ఒకే విధంగా మార్కెట్ విలువలు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కమిటీ కన్వీనర్లు, పట్టణ, గ్రామీణ అభివృద్ధి, ఇండస్ట్రీయల్ పార్కులు, ప్రాజెక్టులు, అభివృద్ధి చెందుతున్న సెంటర్లు తదితరాలపై వివరాల ప్రతిపాదనలను వేగవంతంగా తయారుచేసి కమిటీకి అందజేయాలన్నారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ కె. శ్రీనివాసరావు, నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ జిలాని బేగం, 10 మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆగష్టు 2 నుంచి శ్రావణ మాసోత్సవములు

చోడవరంః పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో ఆగష్టు 2 శుక్రవారం నుంచి 30 శుక్రవారం వరకు శ్రావణమాసోత్సవములు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి గణేష్ తెలిపారు. 2వ తేదీ మొదటి శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు, 9వ తేదీ 2వ శుక్రవారం వరలక్ష్మి పూజ, 15వ తేదీన శ్రావణ శుద్ధ పౌర్ణమి (జంధ్యాల పౌర్ణమి), రాఖీ పండుగ ఉత్సవం ఉంటుందన్నారు. అలాగే 16వ తేదీ 3వ శుక్రవారం శ్రీ సంతోషిమాత అమ్మవారి వార్షికోత్సవం, సామూహిక సంతోషిమాత వ్రతములు ఉంటాయని, వ్రతములో పాల్గొనదలచినవారు ముందుగా పేరు, గోత్రం నమోదు చేసుకోవాలని కోరారు. 20వ తేదీ మంగళవారం బహుళ పంచమి సంతోషిమాత ప్రతిష్ఠ రోజు సందర్భంగా లఘు సంప్రోక్షణ, ప్రత్యేక ఆరాధనలు ఉంటాయన్నారు.23న 4వ శుక్రవారం విశేష పూజలు, 30వ తేదీ 5వ శుక్రవారం ఉదయం, సాయంత్రం శ్రీ సంతోషిమాత అమ్మవారికి కుంకుమార్చనలు ఉంటాయన్నారు. శ్రావణమాసంలో అమ్మవారిని సేవించి, భక్తులు తరించాలని ఈ సందర్భంగా కోరారు.

# అమ్మ సంరక్షణ చారిటబుల్ ట్రస్ట్ పుస్తక వితరణ



టెక్కలిః టెక్కలి నియోజకవర్గం, కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు గ్రామంలో మంగళవారం అమ్మ సంరక్షణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బుక్స్ పంపిణి కార్యక్రమం జరిగింది. అనంతరం కళింగాంధ్ర ఇటీవల చేపట్టిన ఉద్యమంలో బాగంగా ఆ గ్రామంలో గల పిల్లలు, యువత, తల్లి తండ్రులకు జిల్లా విడతీస్తే జరిగే నష్టం గురుంచి కళింగాంధ్ర కార్యవర్గం ప్రతినిధి బోడ్డేపల్లి భాస్కరరావు వివరించి వాలందరినీ ఉద్యమం లో భాగస్వామ్యలు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా శ్రీకాకుళం ప్రజలకు జరిగే నష్టాన్ని వివరిస్తూ ,వారిలో చైతన్య పరచడం జరిగింది.

# మండల పరిషత్ కార్యాలయానికి అందరూ కొత్త వారే

కోటవురట్లః స్థానిక మండల పరిషత్ కార్యాలయ సిబ్బందిలో ఒకరు మినహా మిగతా వారందరూ కొత్తవారే. సార్వత్రిక ఎన్నికల ముందు ఇన్‌చార్జ్ ఎంపిడిఒగా ఈవోపిఆర్‌డి ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపిడిఒగా కొత్త వారు వస్తారని అందరూ ఊహించారు. కానీ గతంలో ఇక్కడ పని చేసి రాజకీయ ఒత్తిడి మేరకు బదిలీ అయిన సువర్ణరాజును మళ్లీ ఇక్కడ నియమించారు. మరో ఎనిమిది నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న ఈవోపిఆర్‌డి ప్రభాకర్‌ను తొలుత పెదబయలు బదిలీ చేశారు.అయిన ప్రస్తుతం గొలుగొండ ఈవోపిఆర్‌డిగా చేరారు. ఇక్కడ సూపరిండెంటెంట్ రాధ పదోన్నతిపై ఇక్కడకు రెండేళ్ల కిందట వచ్చారు. ప్రస్తుతం ఆమె పద్మనాభం మండలం బదిలీచేశారు. ఇక్కడ పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శిరీష నర్సీపట్నం బాలికోన్నత పాఠశాలకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో పాయకరావుపేట నుంచి బదిలీపై వచ్చిన శామ్యూల్ జాయిన్ అయ్యారు. నర్సీపట్నం పిఆర్ నుంచి టైపిస్టుగా శ్రీదేవి ఇక్కడకు బదిలీ పై వచ్చారు. మండలంలో 24 పంచాయతీలకు ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు పని చేశారు. వారందరూ బదిలీ కోరుకున్నారు. కార్యదర్శి సత్యనారాయణ మాత్రం అనారోగ్యం కారణంగా బదిలీ నిలుపుదల చేయించుకున్నారు. వారి స్థానంలో ఏడుగురు కార్యదర్శులు చేరారు. పంచాయతీ కార్యదర్శులుగా ఎన్.సరోజిని, ఎస్.స్వామినాయుడు, కె.శ్రీనివాసరావు, ఎస్.భాగ్యలక్ష్మి, పి.దాలినాయుడు, ఎస్.సంతోషి, బిఎ.సుబ్రహ్మణ్యం, ఎల్. సత్యనారాయణ విధుల్లో చేరారు. గతంలో ఎన్నడూ లేనంతగా అందరూ కొత్త వారు రావడం విశేషం.

# స్పందనకు అధిక ప్రాధాన్యత ఇవ్వండి



నర్సీపట్నంః రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనకు అధిక ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నర్సీపట్నం ఆర్‌డిఒ ఆర్.గోవిందరావు స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో తహశీల్దార్లు, ఎంపిడిఒలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం అన్ని మండల కార్యాలయాలలో తహశీల్దార్, ఎంపిడిఒలు, మండల కార్యాలయ సిబ్బంది తప్పనిసరిగా ఉదయం 10 గంటల నుండి హాజరై ఫిర్యాదు దారుల నుండి పిటిషన్లను స్వీకరించాలన్నారు. సమస్యల తీవ్రతను బట్టి వాటిని శీఘ్రగతిన పరిష్కరించాలన్నారు. అధికారులు సామరస్య పూర్వకంగా వ్యవహరిస్తూ ఫిర్యాదుదారుని సమస్యలను విని, తప్పనిసరిగా రసీదును అందజేయాల్సి ఉంటుందన్నారు. తహశీల్దార్ కార్యాలయంకు ఎక్కువగా భూ సంబంధిత సమస్యలు అధికంగా వస్తున్నాయని, అదే విధంగా రేషన్ కార్డుల కొరకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వాటిని పరిశీలించి సత్వర పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్ల నియామకాలకు సంబంధించి ఇంటర్వ్యూలను ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా నియమనిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని ఎంపిడిఒలను ఆదేశించారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా చాలా జాగ్రత్తగా వాలంటీర్ల నియామకాలను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నర్సీపట్నం డివిజన్ మండల తహశీల్దార్లు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

# నర్సీపట్నంలో కొనసాగుతున్న వలంటరీ ఇంటర్వ్యూలు



నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వలంటరీ ఇంటర్వ్యూలు జరిగాయి. కమిషనర్, డిఇఇ, మున్సిపల్ మేనేజర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అదే విధంగా నర్సీపట్నం మండలంలో ఎంపిడిఒ ఎం.జయమాధవి, ఈవోపిఆర్‌డిలు ఇంటర్వ్యూలు జరిపారు.ఈ సందర్భంగా ఎంపిడిఒ జయమాధవి మాట్లాడుతూ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు చేసుకొని ఇంటర్వ్యూకి హాజరు కాలేని వారికి ఈ నెల 24న ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహిచేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని తెలిపారు. మండలంలో 144 పోస్టులకు 901 మంది దరఖాస్తు చేసుకోగా 703 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. వీరిలో 512 మంది మాత్రమే ఇంటర్వ్యూలకి హాజరయ్యారని తెలిపారు.

# చింతకాయల వరహాల దొర చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

నర్సీపట్నం : చింతకాయల వరహాల దొర చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నుండి 1వ వార్డు కలాసీ కాలనీ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద వరహాలదొర మనవడు చింతకాయల అయ్యన్నపాత్రుడు మేనల్లుడు హర్ష ప్రారంభించారు. అన్నదానం కార్యక్రమం చేపట్టిన మొదటి వారం అనుకున్న దానికన్నా ఎక్కువ మంది రావడంతో ఈ వారం నుండి 150 మందికి పైగా పేదలకు అన్నదానం ఏర్పాట్లు చేశామని హర్ష అన్నారు. అదే విధంగా ప్రతీ మంగళవారం అన్నదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాబా శ్రీను, లాలం మురళీకృష్ణ, పైల గోవిందు, గవిరెడ్డి వెంకటరమణ, ధనిమిరెడ్డి మధు, కొరుప్రోలు శ్రీను, దాడి శ్రీను, బోళెం శివ, పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# విజయసాయిరెడ్డితో ఐఏఎస్ శ్రీలక్ష్మి భేటీ

పంపాలని కోరినట్టు సమాచారం. ప్రస్తుతం తెలంగాణలో క్యాడర్‌లో పనిచేస్తున్న శ్రీలక్ష్మి బదిలీ కోసం గతంలోనే దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఏపీలో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్న తరుణంలో కేంద్రం నుంచి కొన్ని అడ్డంకులు ఎదురైనట్టు తెలుస్తోంది. ఏపీ క్యాడర్‌కు బదిలీ ప్రక్రియలో అడ్డంకులు ఎదురవడంతో మంగళవారం ఆమె విజయసాయిరెడ్డితో పాటు పార్లమెంట్ వద్దకు వెళ్లి కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా, పీఎంవో అధికారులను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో సీఎం జగన్‌ను కూడా శ్రీలక్ష్మి కలిశారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఏపీ నూతన గవర్నర్ హరిచందన్

ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా బిశ్వభూషణ్‌ను తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సత్కరించి స్వామి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. దర్శనం తర్వాత బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. వేంకటేశ్వరుడి ఆలయ సందర్శన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఎప్పటినుంచో తిరుమలకు రావాలని అనుకుంటున్నా సాధ్యపడలేదన్నారు. ఆ భగవంతుడి ఆశీర్వాదంతో దర్శించుకునే మహద్భాగ్యం కలిగిందని చెప్పారు. తితిదే పని విధానం ఎంతో ప్రత్యేకంగా ఉందన్నారు. ఇక్కడి పాలనా వ్యవహారాలు, పరిశుభ్రత గురించి ఎప్పటి నుంచో వింటున్నానని చెప్పారు.

# సభలో సంకుల సమరం

నిరాకరించడంతో స్పీకర్ తదుపరి ప్రశ్నకు వెళ్లారు. దీంతో తెదేపా సభ్యులు ఆందోళనకు దిగారు.

ఆగ్రహించిన శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి
బుగ్గన రాజేంద్రనాథ్.

ఈ సమావేశాలు ముగిసే వరకు తెదేపా సభ్యులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, బుచ్చయ్య చౌదరిలను సస్పెండ్ చేయాలని స్పీకర్‌కు ప్రతిపాదించారు. స్పీకర్ స్థానంలో ఉన్న ఉపసభాపతి కోన రఘుపతి దీనిని ఆమోదించారు. అయినప్పటికీ తెదేపా సభ్యులు సభను వీడలేదు. అక్కడే ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో మార్షల్స్ బలవంతంగా వారిని బయటకు తీసుకెళ్లిపోయారు.

వైఎస్ఆర్ భరోసాపై తుది ప్రకటన చేసింది 2018లో..: జగన్

సభ్యుల సస్పెన్షన్ అనంతరం ప్రతిపక్ష నేత చంద్రబాబు సభలో మాట్లాడారు. 45 ఏళ్లకు పింఛన్‌పై సాక్షి పత్రికలో వచ్చిన కథనాన్ని మరోసారి ప్రస్తావించారు. దీనిపై ముఖ్యమంత్రి జగన్ మరోసారి వివరణ ఇచ్చారు. చంద్రబాబు ప్రస్తావిస్తున్న సాక్షి కథనం 2017 అక్టోబరులో ప్రచురితమైందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు చేయూతనిచ్చే వైఎస్ఆర్ భరోసా పథకంపై తాను తుది ప్రకటన చేసింది 2018 సెప్టెంబర్‌లో అని చెప్పారు. ఈ క్రమంలో మాట్లాడేందుకు చంద్రబాబు సమయం కోరగా.. జగన్ మండిపడ్డారు. ఉపసభాపతి కోన రఘుపతి తర్వాతి బిల్లులపై చర్చ ప్రారంభించారు.

## హామీలు అమలుచేయమంటే సస్పెన్షన్ చేస్తారా?

స్పీకర్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. గుంటూరు తెదేపా రాష్ట్ర కార్యాలయంలో వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి కళా వెంకటరావు మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జగన్ ఇచ్చిన మాట తప్పుతున్నారని.. మడమ తిప్పుతున్నారని వర్ల రామయ్య విమర్శించారు. అమ్మ ఒడి పథకాన్ని ఒకే పిల్లాడికి అమలుచేస్తామంటూ ముఖ్యమంత్రి జగన్ మాటమార్చడం దారుణమని ఆలపాటి అన్నారు.

వాకౌట్ చేసే అవకాశం కూడా ఇవ్వలేదు ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు

ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ముగ్గురు ఉపనేతలను సస్పెండ్ చేశారని ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు ఆరోపించారు. హామీలు విస్మరిస్తున్నారని సభలో ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో మాట్లాడుతూ.. తన స్థానం నుంచి కదల్లేదని.. ఎవరితోనూ దుర్భాషలాడలేదని అన్నారు. 45 ఏళ్లకే పింఛన్ ఇస్తానని పాదయాత్ర సమయంలో జగన్ హామీ ఇచ్చారని, దానిని విస్మరిస్తున్నారని చెబితే సస్పెండ్ చేస్తారా?అని దుయ్యబట్టారు.

# ప్రభుత్వంపై అసహనం పెరుగుతోంది

ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో చంద్రబాబు మాట్లాడారు. ప్రభుత్వంలో అసహనం బాగా పెరిగిపోతోందని.. రాష్ట్రమంతా అభద్రతా భావం వచ్చిందని విమర్శించారు. తాము ప్రభుత్వంపై యుద్ధానికి కత్తులు, కటార్లు తీసుకెళ్లడం లేదన్నారు. ఎన్నికల్లో వైకాపా ఇచ్చిన హామీలను గుర్తు చేస్తుంటే తప్పు అంటున్నారని చంద్రబాబు ఆరోపించారు. తెదేపా ఉపనేతల సస్పెన్షన్‌పై ఏం చేయాలో శాసన సభాపక్ష సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

# వినతుల పరిష్కారంలో పురోగతి

పరిష్కారంలో నాణ్యత ఇంకా మెరుగుపడాలి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి. స్పందన కార్యక్రమం ద్వారా వినతులు స్వీకరించిన తరువాత కలెక్టర్లు ఒక గంట పాటు ఎమ్మార్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తే.. సమస్యల పరిష్కారంలో నాణ్యత మరింత పెరుగుతుంది. స్పందనకు వచ్చే సమస్యల పరిష్కారంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ట్రాకింగ్ విధానం బాగుంది. ఎమ్మార్వో కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌లలో అవినీతి ఉండకూడదు. మండల అధికారులతో నిర్వహించే సమీక్షా సమావేశాల్లో ఈ విషయాన్ని పదేపదే చెప్పాలి. రూపాయి లంచం లేకుండా పని జరిగిందన్నా పేరు రావాలి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఎస్పీలు క ృషి చేయాలి. ఇలాంటి కేసులను ఒక్కో అధికారికి అప్పగించాలి. పోలీస్ స్టేషన్లలో రిసెప్షనిస్టులను ఏర్పాటు చేయాలి.. వారు స్టేషన్‌కు వచ్చే వారిని చిరునవ్వుతో స్వాగతించాలి.

భూ వివాదాల పరిష్కారంలో జాగ్రత్తగా వ్యవహరించాలి..

భూ వివాదాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పరిష్కారం చేసే ఆత్రుతలో అన్యాయం చేయకూడదు. గ్రామ సచివాలయమే రేషన్‌కార్డును ప్రింట్ చేసి లబ్ధిదారులకు అందజేస్తుంది. ఇది పాలనలో విప్లవాత్మక మార్పు. ఉగాది నాటికి రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు ఇంటి స్థలం ఇవ్వాలి. బడ్జెట్‌లో రూ. 5 వేల కోట్లు ఈ కార్యక్రమం కోసం కేటాయించాం. ఇంతకుమందు ఎవ్వరూ ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదు. హాస్టళ్లలో వసతుల మెరుగు పరచడంకోసం ప్రతి జిల్లాకు అధికారులు రూ. 7 కోట్ల నిధులు కేటాయించారు. ఆ నిధులను హాస్టళ్లను బాగుచేయడానికి వెచ్చించండి. ఇంకా అవసరమైతే ఎక్కువ నిధులు కేటాయిస్తాం.

స్కూళ్లలో కనీస వసతులపై ప్రత్యేక ద ృష్టి సారించండి..

రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో పరిస్థితిని ఫొటోలు తీసి పంపండి. 2-3 ఏళ్లలో వ్యవస్థీక ృతంగా స్కూళ్లను మెరుగుపరుస్తాం. స్కూళ్లలో పరిశుభ్రత, కనీస వసతులపై ప్రత్యేక ద ృష్టి సారించండి. ఇసుక కొరత ఉన్నట్టు కొన్ని వార్తలు వస్తున్నాయి. అందుకోసం కొంత వెసులబాటు కల్పించి కొరత లేకుండా చూడాలి. అదే సమయంలో అవినీతి లేకుండా జాగ్రత్త పడాలి. కరెంట్ కోతలు లేకుండా చర్యలు చేపట్టాలి. వర్షాలకు ముందు మెయింటెనెన్స్‌కు గత ప్రభుత్వం అంగీకరించకపోవడం వల్లనే ఆ పనులు ఇప్పుడు చేయాల్సివస్తోందని అధికారులు చెప్తున్నార'ని తెలిపారు.

## మహిళలకు 50శాతం రిజర్వేషన్ చారిత్రాత్మక నిర్ణయం

తెదేపా అధినేత చంద్రబాబును ఉద్దేశించి రోజా వ్యాఖ్యానించారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలంటే అనుభవం అవసరం లేదని.. మంచి మనసుండాలన్నారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంపై మహిళలమంతా గర్వపడుతున్నామని చెప్పారు. మొదటి శాసనసభ సమావేశాల్లోనే మహిళల కోసం బిల్లులను తీసుకొచ్చి చరిత్ర సృష్టించారన్నారు. గిరిజన మహిళకు ఉపముఖ్యమంత్రి, దళిత మహిళకు హోంమంత్రి పదవులు ఇచ్చిన ఏకైన సీఎంగా జగన్ రికార్డులెక్కుతారన్నారు.

# ఏపీలో సామాజిక విప్లవం..

సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ బిల్లును ఆమోదిస్తుండటం తనకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అమ్మ ఒడి పథకంతో తల్లులందరికీ చేయూత లభిస్తుందని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌తోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు న్యాయం జరగుతుందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు అవకాశం కల్పించేందుకే తమ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చిందన్నారు. సామాజిక న్యాయం కోసం సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

మరో సభ్యురాలు జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ.. అమ్మ ఒడి పథకం తల్లులందరికీ గొప్ప వరమని కొనియాడారు. అమ్మ ఒడితో అక్షరాస్యత రేటు పెరుగుతుందన్నారు. వైఎస్ జగన్ ప్రకటించి అమలు చేస్తున్న నవరత్నాల పథకంతో మహిళలందరికీ మేలు జరుగుతుందన్నారు. కాంట్రాక్టుల్లో కూడా మహిళలకు స్థానం కల్పించడం గొప్ప విషయమన్నారు. సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయం పాటిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం డ్వాక్రా రుణామాఫీ పేరుతో మహిళలను నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులుగా పుట్టాలని ఎవరు అనుకుంటారని వ్యాఖ్యలు చేసిన నీచ సంస్క ృతి చంద్రబాబుదని వైఎస్సార్‌సీపీ సభ్యుడు మేరుగు నాగార్జున మండిపడ్డారు. దళితులను చంద్రబాబు ఏ ఒక్క రోజూ పట్టించుకోలేదని విమర్శించారు. దళితులకు న్యాయం చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగనేనని పేర్కొన్నారు. సభ్యుడు పీ రాజన్న దొర మాట్లాడుతూ అందరికీ మంచి చేయాలనే ఆలోచన సీఎం వైఎస్ జగన్‌ది అని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఆర్థికంగా, రాజకీయంగా అవకాశం కల్పించిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని అన్నారు.

# టిసిఎస్ డిజిటల్‌కు 14 మంది ఎంపిక



సాగర్‌నగర్‌: గీతం విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ప్రాంగణ నియామకాలలో ఇంజనీరింగ్ విద్యార్థుల హవా కొన సాగుతోంది. ఇటీవలే ప్రపంచ ప్రఖ్యాత మైక్రోసాఫ్ట్ కంపెనీ ముగ్గురు విద్యార్థులకు భారీ వేతనాలను ఆఫర్ చేయగా తాజాగా భారతీయ ఐటి దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 14 మంది విద్యార్థులను ప్రాంగణ నియామకాలలో ఎంపిక చేసుకుంది.

టిసిఎస్ డిజటల్ జరిపిన ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తర్ణత సాధించిన విద్యార్థులకు హైదరాబాద్‌లో మౌఖిక ఇంటర్వ్యూలను నిర్వహించి మంగళవారం ఫలితాలను ప్రకటించారని గీతం ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారి కమాండర్ గురుమూర్తి గంగాధరన్ తెలిపారు.

కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా, రోబోటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి నూతన ప్రాజెక్టులకు 14 మంది గీతం విద్యార్థులు ఎంపికయ్యారని ఆయన వెల్లడించారు. ఎంపికయిన విద్యార్థులకు రూ.7 లక్షల రూపాయల వార్షిక వేతనం లభిస్తుందన్నారు.

వీరితో పాటు టిసిఎస్ నింజా జాతీయ పరీక్షలో మరో 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్లేస్ మెంట్ డైరక్టర్ తెలిపారు.వీరు కూడా త్వరలో టిసిఎస్ డిజటల్ ఇంటర్వ్యూలకు హజరవుతారని ఆయన తెలిపారు.

గీతం పూర్వవిద్యార్థి టిసిఎస్ అంతర్జాతీయ వ్యవహరాల విభాగం అధిపతి ఎ.విష్ణుమాధవ్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారని పేర్కొన్నారు. కాగా ఎంపికయిన విద్యార్థులను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి. బాలాజీ అభినందించారు.

# మంత్రిని కలిసిన వై కా పా నాయకులు ..



అక్కయపాలెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు ,మరియు వాణిజ్యం ,సమాచార ,సాంకేతిక ,శాఖా మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ని సచివాలయం లో మర్యాద పూర్వకంగా స్థానిక జీవీఎంసీ 36 వార్డ్ వై కా పా సీనియర్ నాయకుడు

కర్రి. రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు .రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా గెలుపుకు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్చము ఇచ్చి సాలువతో సత్కరించారు .

## ప్రజలందరి భాగస్వామ్యంతోనే
# ఉత్తమ ర్యాంక్ లక్ష్యం కావాలి

- స్వచ్ఛసర్వేక్షణ్ 2020 నిబంధనలు పాటించండి
- తడి-పొడి చెత్త విభజన, సేకరణ, రవాణాకు ప్రాధాన్యత
- నగరంలోని 328 కమ్యూనిటీ/ పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణలో లోపం లేకుండా చూడండి
- జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం: జివియంసి పరిధిలోని ప్రజలందరి భాగస్వామ్యంతోనే ఉత్తమ ర్యాంక్ సాధన లక్ష్యం కావాలని కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో స్వచ్ఛ సర్వేక్షణ్ 2020 నిబంధనలు, గార్బేజ్ ఫ్రీ సిటీలు అమలుపై సోమవారం సాయంత్రం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ 2020 నిబంధనలు, సూచనలు పాటించడం ద్వారా మెరుగైన, ఉత్తమ ర్యాంక్ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తడి-పొడి చెత్త విభజన, సేకరణ, రవాణాకు ప్రాధాన్యత నివ్వడం ద్వారా ర్యాంకు మెరుగుపరచుకోవచ్చునని అభిలషించారు. వేస్ట్ పికర్స్‌కు శిక్షణ, నిరంతర సేవలలో వినియోగించడం ద్వారా వారికి ఉపాధి కల్పించవచ్చునని అభిలషించారు. నగరంలోని 328 కమ్యూనిటీ/ పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణలో లోపాలు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించాలని కోరారు. పారిశుధ్య సిబ్బందికి తరచు కెపాసిటీ బిల్డింగ్ ద్వారా నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. ప్రజలు, పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

కార్యక్రమానికి సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్ అధ్యక్షతవహిస్తూ స్వచ్ఛసర్వేక్షణ్, ర్యాంకుల సాధన వివరాలను వివరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ (జనరల్) ఏ.వి.రమణి, అదనపు కమిషనర్ (ఫైనాన్స్) సత్యనారాయణ, సిసిపి విద్యుల్లత, యస్.ఇలు, ఇఇలు, జోనల్ కమిషనర్స్, ఏ.యం.ఓ.హెచ్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## 27న గీతంలో
# మాజీ రాయబారి విశ్వనాథన్ ప్రసంగం

సాగర్‌నగర్‌: బ్రెజిల్‌లో భారతదేశ మొదటి రాయిబారిగా పనిచేసి తదనంతరం అర్జెంటీనా, ఉరుగ్వే తదితర దేశాలలో సహితం రాయబారిగా వ్యవహరించిన రెంగరాజ్ విశ్వనాధన్ జులై 27వ తేదీన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక ప్రసంగం చేయిడానికి హజరవుతున్నారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ తెలిపారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహరాల మంత్రిత్వశాఖ ఆద్వర్యంలో ఏర్పాటువుతున్న కార్యక్రమంలో "లాటిన్ అమెరికాతో వాణిజ్యం"అనే అంశంపై భారత మాజీ రాయబారి రెంగరాజ్ విశ్వనాధన్ ప్రసంగిస్తారు. వివిధ దేశాలలో భారత ప్రభుత్వ దౌత్య అధికారిగా పనిచేసిన రెంగరాజ్ విశ్వనాధన్ లాటిన్‌అమెరికా వాణిజ్య అంశాలపై అద్యయనం చేస్తున్నారు.లాటిన్ అమెరికా మరియు కరేబియన్ డివిజన్ సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించారు. భారత మాజీ రాయబారి గీతం విశ్వవిద్యాలయానికి హజరవుతున్న సందర్భంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు.

# చేపల వ్యాపారులకు న్యాయం న్యాయం చేయాలి

## కె కె రాజుకు వినతి పత్రం



విశాఖపట్నం : 36 వార్డు కశీచరపాలెం జాతీయ రహదారి అనుకోని ఉన్న అశోక్ నగర్ లో గత 30 సంవత్సరం లు గా చేపల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరిని జి వి ఎం సి అధికారులు ఖాళీ చేయమని అదేశించారని మాకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించేలా చూడాలని మంగళవారం అక్కడ మహిళలు విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు ను సీతమ్మదార పార్టీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కె కె రాజు మాట్లాడుతూ ఈ విషయమై జి వి ఎం సి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 36 వార్డు అధ్యక్షుడు కె పి రత్నాకర్ తో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 55వ వార్డు సమస్యలు పరిష్కరించండి



విజయసాయిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్

పరవాడ: రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డినీ పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ,55వ వార్డు అద్యక్షులు బట్టు సన్యాశిరావు,అజయ్ రాజు తథితర్లు మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరము 55వ వార్డులోగల సమస్యలు పరిష్కరించాలనీ అయన కోరారు. కాలుష్య కోరల్లో చిక్కికున్న దేవాడ, పిట్టవానిపాలెం, స్వయంభువరం తథితర గ్రామాలును తరిలించాలనీ కోరారు. మెడిటక్ లో భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో నష్టపరిహారాన్ని చెల్లించాలనీ కోరారు. మెడిటక్ లో 75% లబ్దిదార్లుకు, స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలనీ కోరారు. హిందూజా, ఎన్టీపిసిలో స్థానికలుకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనీ కోరారు. పార్మసిటి కంపెనీలుకు అనుకోనివున్న తాడి గ్రామాన్ని కూడా తరిలించాలనీ కోరారు. పైన పేర్కొన్న సమస్యలు గురించి విజయసాయిరెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తామనీ హమీ ఇచ్చారు అనీ తెలిపారు.

## సామాజిక న్యాయం అమలు చేస్తున్న
# ఏకైక సీఎం వైయస్ జగన్



విశాఖపట్నం : పెదవాల్తేరు లోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్షులు రాజు గౌడ్ యాత మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ లకు నామినేటెడ్ పదవుల్లో మరియు నామినేటెడ్ పనుల్లో 50% రిజర్వేషన్లు అమలు చేసే విధంగా ఏపీ సీఎం జగన్ భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా బడుగు బలహీన వర్గాలు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు గాను ప్రవేశపెట్టారని అదేవిధంగా ఆయా వర్గాల మహిళలకు కూడా 50% రిజర్వేషన్లు బిల్లు ప్రవేశపెట్టిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు దని తెలిపారు. బీసీలకు 29%, ఎస్సీలకు 15% ఎస్టీలకు 6% పదవులు పనులు కేటాయించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు అన్ని కార్పొరేషన్లు సంస్థల్లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ లకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం మరియు అన్ని దేవాదాయ బోర్డులు వర్క్ బోర్డులు అన్నిటిలో కూడా 50% రిజర్వేషన్లు కల్పించారు ట్రస్ట్ లో కూడా 50% రిజర్వేషన్లు కల్పించడం అభినందనీయమని తెలిపారు ఈ చట్టాలు వలనడరు బతీహీన వరాలు సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందుతాయని.. ఆర్థికంగా నిలదొక్కుకుంటే . అని స్వర్గీయ మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు బలహీన వర్గాల ప్రజల గుండెచప్పుడు అయ్యారని ఇప్పుడు స్వర్గీయ వైయస్సార్ కంటే రెండడుగులు ముందుకు వేసి వైయస్ జగన్మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఈ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి రాష్ట్రం లో గల బడుగు బలహీన వర్గాలు మైనారిటీ వర్గాలు మహిళలు అందరి గుండెల్లో చిరస్థాయిగా దశాబ్దాల కాలం నిలిచిపోతారని తెలిపారు ఇటువంటి మహత్తర మైన బిల్లులను మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అడ్డుకోవడం సిగ్గుచేటని రానున్న రోజుల్లో బడుగు బలహీన వర్గాల ప్రజలు చంద్రబాబు నాయుడుకి తగిన బుద్ధి చెబుతారని ఇటువంటి టిడిపి పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూస్థాపితం అవుతుందని కనుమరుగవుతుందని హెచ్చరించారు.

# అవినీతి రహిత వ్యవస్థ ఏర్పడాలి

## ముఖ్యమంత్రి వైఎస్ జగన్



విశాఖపట్నం : ప్రభుత్వంలో అవినీతి రహిత వ్యవస్థ ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం నా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన కార్యక్రమంతో పాటు అనేక విషయాలపై సమీక్ష చేసి ఆదేశాలు ఇచ్చారు ఏ కార్యాలయానికి వెళ్లిన ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా తన పని అయిందని సామాన్యుడు సంబర పడాలి అన్నారు. జిల్లా కలెక్టర్లు స్పందన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాసిల్దార్ కార్యాలయంలో ఉన్న మండల ప్రజలతో నేరుగా మాట్లాడాలని, అప్పుడే అందరిలో ప్రభుత్వంపై నమ్మకం కుదురుతుంది అన్నారు. స్పందన సమస్యల పరిష్కారంలో ప్రగతి సాధించిన అందులకు గాను జిల్లా కలెక్టర్లను అభినందించారు. అర్జీల పెండింగ్ 58శాతం నుండి 25 శాతం కి తగ్గిందని ఇది మరింత మెరుగు అవ్వాలని చెప్పారు.

**స్పందన పట్ల ప్రజల్లో నమ్మకం కలిగింది జిల్లా కలెక్టరు వి. వినయ్ చంద్**

స్పందన కార్యక్రమం పట్ల జిల్లాలో మరింత చైతన్యం వచ్చిందని ముఖ్యమంత్రికి తెలిపారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సో విశాఖపట్నం నుంచి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నందున స్పందన కార్యక్రమానికి ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరై దరఖాస్తుల ద్వారా విన్నపాలు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. పరిష్కారాలలో స్పష్టత, సవివర నివేదిక లకు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. పరిష్కారాలను వేగవంతం చేసేందుకు, స్పష్టమైన వివరణ కొరకు తాసిల్దార్ లతో వీడియో కాన్ఫరెన్సులు

ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.

**పాఠశాలల అభివృద్ధి**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి జిల్లాకు రూ.14 కోట్లు మంజూరు చేసి ప్రస్తుతం రూ.7 కోట్లు విడుదల చేయడం జరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి పాఠశాలకు ఇప్పుడు ఉన్న పరిస్థితిని ఫొటో తీయాలని, రానున్న కాలంలో అభివృద్ధి చేసిన తర్వాత కూడా ఒక ఫొటో తీయాలని ఆ రెండు ఫోటోలను నాడు-నేడు అని ఆ పాఠశాలలో పొందుపరచాలన్నారు.

**అక్టోబర్ 2 నుండి గ్రామీణ విప్లవం**

అక్టోబర్ 2 నుండి గ్రామ సచివాలయాలు ప్రారంభమవుతాయని ప్రభుత్వ కార్యక్రమాలన్నీ వాటి ద్వారానే అమల జరుగుతాయన్నారు.



రేషన్ కార్డులు పెన్షన్లు ఇండ్లమంజూరు భూమి సర్వే మొదలైన సేవలు అందుతాయన్నారు. దీనిని ముఖ్యమంత్రి గ్రామీణ విప్లవంగా అభివర్ణించారు.నీటి లభ్యతను గణనీయంగా పెంచేందుకు అనేక చర్యలు చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. సమగ్రంగా చెత్త నిర్వహణ చేపట్టి నీరు కలుషితం కాకుండా చేస్తామని, వర్షపు నీరు వడిసి పట్టడం, జల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎల్ వి సుబ్రహ్మణ్యం, ఆరోగ్యరాజ్, డిజిపి గౌతం సవాంగ్ పాల్గొనగా విశాఖపట్నం నుండి కలెక్టర్ వినయ్ చంద్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఎల్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను గుర్తించాలి



విశాఖపట్నం: 38 ప్రభుత్వ భూములను గుర్తించి ఇళ్ల స్థల పట్టాల జారీ చేయడానికి ఉగాది నాటికి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ తహసిల్దార్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇళ్ల స్థల పట్టాలు, స్పందన దరఖాస్తులపైన ఆర్.డి.ఓ.లు, తహసిల్దార్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తహసిల్దార్లు బాగా కష్టపడాలని, తహసిల్దార్లు పటిష్టమైన ప్రణాళిక తయారు చేసుకొని క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని చెప్పారు. ముఖ్యమంత్రి వివిధ అంశాలపై లక్ష్యాలను ఉంచినట్లు పేర్కొన్నారు. ఇళ్ల స్థల పట్టాలపై ఆర్.డి.ఓ.లు కూడా దృష్టి సారించాలన్నారు. 2020, మార్చి నాటికి ఇళ్ల స్థల పట్టాలు సిద్ధం చేయాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సర్వే నంబర్ వారీగా చూడాలన్నారు. మొదట ఏ ఆటంకాలు లేని భూములను గుర్తించాలని, వివిధ సంస్థలకు కేటాయించిన భూములు వినియోగంలో లేకపోతే వాటిని సమీక్షించాలని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇళ్ల స్థల పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి చెప్పారని, కుటుంబానికి సంబంధించిన సామాజిక వివరాలు, తదితర విషయాలు సేకరించాలని పేర్కొన్నారు. మండల స్థాయిలో అవినీతి జరగకుండా చూడాలని తహసిల్దార్లను ఆదేశించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎల్. శివశంకర్, పాడేరు సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ ప్రతిష్ట, ఆర్డీఓలు ఎన్. తేజ్ భరత్, గోవిందరావు, కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి శ్రీనివాసరావు, రామలక్ష్మి, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## కెఎన్‌ఆర్ చారిటుబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో
# ప్రేమ సమాజంలో ఉన్న విద్యార్థలకు ఉచిత బస్‌పాసుల పంపిణీ



విశాఖపట్నం : చిరకాలంగా పేదలకు అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్న కందుల నాగరాజుకు ఆ దేవుడు దీర్ఘాయుష్షును కల్పించాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ద్రోణం రాజు శ్రీనివాస్ రావు అన్నారు. కెఎన్‌ఆర్ చారిటుబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళ వారం ప్రేమ సమాజంలో విద్యార్థులకు బస్ పాసుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా క్రమం తప్పకుండా విద్యార్థులకు బస్ పాసులు అందిస్తున్న నాగరాజును అభినందించారు.

ఆయన పుట్టినరోజు వేడులకు పేద మహిళలు, వృద్దులకు చీరలు పంపిణీ, పేద వధువులకు తాళిబొట్లు అందజేయడం, పేదలకు ప్రతి నెల బియ్యం అందజేయడం వంటివి క్రమ తప్ప కుండా చేయడం ఆనందాయక మన్నారు. అనంతరం విద్యార్థులకు బస్ పాస్‌లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కెఎన్‌ఆర్ చారిటుబుల్ ట్రస్ట్ చైర్మన్ కందుల నాగ రాజు, ఏవీఎస్ఎన్ గుప్తా, డిస్ట్రిక్ట్ గవర్నర్ కెసీఎఫ్టీ కొల్లూరు సోమేశ్వరరావు, జాన్ వెస్లీ, మద్దెలపాలెం డిపో మేనేజర్ అరుణ కుమారి, కీర్తన, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### చంద్రయాన్-2.. గర్వదాయకం

భారత శాస్త్రవేత్తలు చంద్రయాన్-2 ప్రయోగాన్ని దిగ్విజయంగా ప్రారంభించడం గర్వదాయకం. చంద్రుడిపైకి అధ్యయన పరికరాలను మోసుకుపోతున్న రాకెట్ సోమవారం అగ్ని కీల లను వెదజల్లుతూ నింగిలోకి దూసుకుపోతున్న దృశ్యాన్ని దేశ ప్రజలు ఆనందంగా, గర్వంగా తిలకించారు. అగ్రరాజ్యాలు ఇప్పటికే చంద్రుడిపై పరిశోధనల్లో ముందంజలో ఉండవచ్చు. కానీ ఒక వర్ధమాన దేశంగా భారత్ అనేక సామాజిక, ఆర్థిక సమస్యలను అధిగమిస్తూ, ప్రజాస్వామిక వ్యవస్థను కాపాడుకుంటూ, వైజ్ఞానిక పరిశోధనల్లో ఆకాశమంత ఎత్తుకు ఎదుగడం అసాధార ణం. దేశ ప్రజలకే కాదు, వర్ధమాన సమాజాలన్నిటికీ స్ఫూర్తిదాయకం. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి అణుశక్తి, అంతరిక్షం వంటి శాస్త్ర వైజ్ఞానిక రంగాలపై దృష్టిసారించి ప్రయోగాలు సాగించిన ఫలితమే ఈ నాటి చంద్రయాన్-2 ప్రయోగం. ప్రధాని మన్మోహన్ హయాంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు అనేక అవాంతరాలను ఎదుర్కొన్నది. రష్యా శాస్త్రవేత్తల సహకారం ఉపయోగకరం కాదని తేలిన తర్వాత, భారత శాస్త్రవేత్తలు అత్యంత ఆత్మవిశ్వాసంతో ఈ ముం దడుగు వేశారు. ఈ కార్యక్రమం పలుసార్లు వాయిదా పడ్డా చివరికి శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపు ణుల కృషిఫలించింది. ఇటీవల చివరిక్షణంలో సాంకేతిక సమస్య తలెత్తి వాయిదా పడ్డది. అయి నా అతి తక్కువ సమయంలో అహర్నిషలు కృషిచేసి చక్కదిద్ది చంద్రయాన్-2 ప్రయోగాన్ని సాధించగలిగారు. నెహ్రూతో సహా నాటి స్వాతంత్ర్యోద్యమ తరం కన్న కలల పర్యవసానమే ఈ చంద్రయాన్ ప్రయోగం. ఉపగ్రహాల ప్రయోగం మొదలుకొని చంద్రయాన్ తొలి యానం వరకు భారత్ అనేక విజయాలను సాధించింది. భవిష్యత్తులో సాగబోయే గగన్‌యాన్ వంటి అనేక పరిశోధనలకు కావలసిన ఆత్మస్థైర్యాన్ని ఈ చం ద్రయాన్-2 అందిస్తున్నది. ఏ దేశ అభివృద్ధికైనా శాస్త్రీయ దృక్పథమే ప్రధాన భూమికను పోషిస్తుంది. యురోపియన్ సమాజాలు ఇంతగా అభివృద్ధి చెందాయంటే, అందుకు కారణం వారు పెంపొందించుకున్న శాస్త్రీయ దృక్కో ణమే. ఛాందసవాదం అలుముకున్న ఏ దేశమైనా అంతఃకలహాలలో, నిరంకుశ పాలనలో మగ్గి పోయాయే తప్ప ముందుడగు వేయలేదు. భారత్ కూడా స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి లౌకిక, శాస్త్రీయ దృక్కోణాన్ని పెంపొందించుకోవడం వల్లనే ఈ అభివృద్ధిని సాధించగలిగింది. అమెరికా, రష్యా, చైనా తరువాత సొంతంగా చంద్రుడిపై అధ్యయనానికి సొంతంగా ప్రయోగాలు జరిపిన ఘనత భారత్‌కు దక్కు తుంది. ఈ ప్రయోగ ప్రారంభం దిగ్విజయంగా ముగిసింది. మిగతా సంక్లిష్టదశను కూడా సజా వుగా అధిగమిస్తుందని ఆశిద్దాం. రాకెట్ల ద్వారా ఉపగ్రహాలను ప్రయోగించిన భళా అనిపించు కున్న చరిత్ర భారత శాస్త్రవేత్తలకు, నిపుణులకు ఉన్నది. అయితే చంద్రయాత్ర మరింత సంక్లి ష్టమైనది. భూ కక్ష్యలో స్థిరపడటం వరకు సరే. కానీ ఆ తర్వాత క్రమ పద్ధతిలో భూ కక్ష్యలు ఛేదించుకుంటూ పోయి, చంద్రుడి కక్ష్య ప్రవే శించాలె. చంద్రుడికి వంద కిలోమీటర్ల ఎత్తున ఉన్న కక్ష్యలో ఆర్బిటర్ పరిభ్రమిస్తూ ఉంటుం ది. ఈ ఆర్బిటర్ నుంచి లాండర్ విడివడి చం ద్రతలంపై సాఫీగా దిగడం అత్యంత కీలక దశ. లాండర్ జాగ్రత్తగా దిగిన తర్వాత దాని నుంచి రోవర్ విడిపోయి చంద్రతలంపై 14 రోజుల పాటు తిరుగాడుతూ వివరాలను సేకరించి పంపిస్తుంది. చంద్రుడి చుట్టూ కక్ష్యలో పరిభ్రమిస్తున్న ఆర్బిటర్ ఏడాది పాటు చంద్రుడిపై వివరాలను గ్రహించి పంపిస్తూ ఉంటుంది. ఇప్పటివరకు ఏ దేశమూ చేరని చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంపై భారత్ రోవర్‌ను చేరవేస్తున్నది. ఎంతో అభి వృద్ధి చెందిన జర్మనీ, ఫ్రాన్స్, జపాన్ వంటి దేశాలు మన దేశం మాదిరి చంద్రుడిపై ప్రయోగాలు చేపట్టడం లేదు. కానీ మన దేశానికి అవసరమా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. అయి నప్పటికీ చంద్రయాన్ ప్రయోగాన్ని నిరర్థకమైందిగా చెప్పలేము. భారత్ చంద్రయాన్ ప్రయోగం ద్వారా తన వైజ్ఞానికాభివృద్ధిని ప్రపంచానికి చాటుకోగలుగుతున్నది. అయితే బాధ్యతాయుత ప్రభుత్వాలు ఉండే భారత్ వంటి ప్రజాస్వామిక దేశాలలో ఇంతటి భారీ బడ్జెట్ పథకాలు ఏదో గొప్ప కోసం చేపట్టడం జరుగదు. కాకపోతే ఒక్కోసారి అన్ని వివరాలు స్పష్టంగా చెప్పడమూ జరుగదు. చంద్రుడిపై నీటి జాడలపై మరింత లోతుగా పరిశోధించడమే చంద్రయాన్ లక్ష్యంగా చెబుతున్నారు. అయితే చంద్రుడిపైకి పంపుతున్న అధ్యయన ఉపకరణాలలో హీలియం- 3 ఉని కిని పసిగట్టేవి కూడా ఉన్నాయి. రేడియో ధార్మికత ప్రమాదం లేకుండా హీలియం-3 ద్వారా భవిష్యత్ మానవ అవసరాలను తీర్చవచ్చుననే వాదన ఒకటి ఉన్నది. చైనా కూడా చంద్రుడిపై అధ్యయన లక్ష్యం హీలియం-3 తవ్వకాలేనని అంటున్నది. అయితే భారత్‌కు సంబంధించి చం ద్రయాన్ ప్రయోగాన్ని ఇక్కడి సమాజం లాభనష్టాల కన్నా శాస్త్రీయ చింతనతోనే చూస్తున్నది.

## ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య సేవలపై ప్రజలకు మరింత నమ్మకం పెంపొందేలా డాక్టర్లు పనిచేయాలి



పెద్దాపురం : ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య సేవలపై ప్రజలకు మరింత నమ్మ కం పెంపొందేలా డాక్టర్లు పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆర్డీవో ఎస్.మల్లిబాబుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా వార్డుల్లోకి వెళ్లి రోగులకు సంబంధించిన వ్యాధులపై ఆరా తీశారు. ఒకే ఊరికి సంబంధించిన ఇద్దరు డయేరియా వ్యాధికి వైద్య సేవలు పొందుతున్నట్లు గుర్తించి,వీరి గ్రామంలో డయేరియాకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోమని ఏఎస్ఎమ్ లకు అదేశా లివ్వాలని సూచిం చారు. తదుపరి మరుగు దొడ్లలోకి తానే స్వయంగా వెళ్లి పరిశీ లించగా దుర్వాసన రావడంతో ప్రక్కనే ఉన్న డ్రైనేజీలో నీరు నిల్వ ఉండడం జెసి గమనించారు. అనంతరం డాక్టర్ ఛాంబర్లో ఆర్డీవో,డాక్టర్లు వర్మ, అప్పారావులతో కలిసి సమావేశమై ఆసుపత్రి సిబ్బంది హాజరుపట్టి,ఒపి రిజిస్టర్ లను పరిశీలించారు. మరుగుదొడ్ల పారిశుద్ధ్యం లోప భూయి ష్టంగా వున్నదని, దీనికి సంబం ధించిన ఏజెన్సీకి మెమోను జారీ చేయమని ఆదేశించడం జరిగింది. స్టాఫ్ నర్స్ లు ఇద్దరు కావలసిఉందని, కొన్ని రకాల మందుల కొరత ఉందని, ప్రతి రోజు సుమారు 450ఒపి వస్తుందని, అంబులెన్స్ రిపేరులో ఉందని,డ్రైవర్ పోస్టు లేదని డాక్టర్లు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత సమస్యలపై మొదటిగా డిఎంహెచ్ఓకు తెలియజేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆసుపత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయమని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలియజేసారు. మానవతా దృక్పథంతో డాక్టర్లు, వైద్య సిబ్బంది పేద ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిం చాలని కోరారు.ఈ కార్య క్రమానికి ముందు పెద్దాపురం మండల పరిషత్ కార్యా లయంలో జరుగుతున్న గ్రామ వాలంటీర్ల ముఖాముఖి కార్యక్రమాన్ని, కార్యాలయాన్ని జెసి లక్ష్మీశ పరిశీలించారు.

## ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి : ట్రాఫిక్ సీఐ కిరణ్ కుమార్



అనకాపల్లి : అనకాపల్లి ఆనందపురం ఆరులైన్ల జాతీయ రహదారి నిర్మాణ పనుల కారణంగా విశాఖకు అలాగే సబ్బవరం వైపు వెళ్లే వాహనాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ సి ఐ కిరణ్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక జల గల మధు జంక్షన్ వద్ద రహదారులు నిర్మిస్తున్న దిలీపు బిల్డ్ కాన్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు, ఫ్లైఓవర్ నిర్మాణల కోసం జరిగసర్వేలో సంబందిత అధికారులు హైవే 16 జీ ఎమ్ ఆర్ ప్రతినిధులతో చర్చించారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ సే కిరణ్ కుమార్ మాట్లాడుతూ రహదారులు ఫ్లైఓవర్ నిర్మాణాలు జరుగుతున్న సమయంలో రాను పోను వాహనాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు తగిన విధి విధానాలు పై ఎస్ ఐ స్వామి నాయుడు తో చర్చించారు.

## ప్రజలను దోచుకుంటున్న కేబుల్ యజమానులు



అనకాపల్లి : సిటీ కేబుల్ యజ మానులు ప్రజలను దోచుకుం టున్నారని, సర్వేజన ఐక్యవేదిక వ్యవ స్థాపకులు కోరిబిల్లి పరి అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేబుల్ ఆపరేటర్లు దోపిడీకి హద్దు అదుపు లేకుండా పోయిందన్నారు. కేవలం వంద రూపా యలు గతంలో వసూలు చేసేవారని, సుమారు 150 కి పైగా చానల్స్ వచ్చే వన్నారు. ఇప్పుడు 250 రూపాయుల బరితెగించి వసూలు చేస్తున్న 60 చానళ్లు కూడా రాలేద న్నారు. సామాన్య ప్రజలు వినియోగదారుల ఫిర్యాదును పట్టించు కోలేదన్నారు. ఒక్కరోజు కేబుల్ చార్జి చెల్లిం చడం ఆలస్యమైతే ప్రసాదాలు నిలిపివేస్తు న్నారన్నారు. వీరి ఆగడా లకు చెక్ పెట్టా లని ఈసందర్బంగా ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి కేబుల్ వ్యవస్థపై సరైన నిర్ణయాలు తీసుకుని వినియోగదారులకు న్యాయం చేయాలని ఈసందర్బంగా కోరిబిల్లి పరి కోరారు.

## వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి గారు బి.సి.,యస్సీ, యస్టీ, మైనార్టీల అభ్యున్నతే ధ్యేయంగా నామినేట్ పదవుల్లో 50శాతం కేటాయించటం చారిత్రక నిర్ణయమని దీనిని హర్షిస్తూ వై.యస్.ఆర్.స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆంధ్రా యూనివర్శిటీలోని డా॥బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విశాఖ పార్లమెంట్ విద్యార్థి విభాగం అధ్యక్షులు బి.కాంతారావు మాట్లా డుతూ స్వాతంత్ర భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా నామి నేటెడ్ పదవులలో 50శాతం బిసి, యస్సీ, యస్టీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవులలో కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని, ఇది దేశచరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన చరిత్ర అన్నారు. వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి గారు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని బి.సి.ల అభివృద్ధే ధ్యేయంగా ఇలాంటి నిర్ణయాలు చేశారని, స్థానికులకు 75శాతం ఉద్యోగాలు ఇవన్నీ మంచి నిర్ణయాలని అన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టులలో 50శాతం యస్సీ, యస్టీ, బి.సి. మైనార్టీలకు వాటా ఇవ్వడం అనేది బడుగు, బలహీన వర్గాలను ఆర్థిక అభివృద్ధిపై వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి ఎంతటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది. అలాగే బి.సి.లకు బి.సి. కమీషన్ ఏర్పాటు చేస్తామనటం, బి.సి.ల మీద ఎంత ప్రేమో అర్థమవు తుందన్నారు. బి.సి, యస్సీ, యస్టీ, మైనార్టీలందరూ వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి అండగా ఉండి, వై.యస్.జగన్‌మోహన్ రెడ్డికి స్థానిక ఎన్నికలు-2024లో కూడా ప్రభంజనం సృష్టిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్.సి.పి. విద్యార్థి విభాగం, విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు బి.కాంతారావు, వై.యస్.ఆర్.సి.పి. విద్యార్థి విభాగం ఏ.యూ. అధ్యక్షులు బి.మోహన్, వై.యస్.ఆర్.సి.పి. విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శులు: యస్.కుమారస్వామి, ఎమ్.కళ్యాణ్, విద్యార్థి నాయకులు: సిహెచ్.క్రాంతికిరణ్, కె.సాయిక్రిష్ణ, నవీన్, రంజిత్, భరత్, పవన్, సాగర్, రమణ, విజయక్రిష్ణ, వెంకటేష్, ఓంకార్, అనిల్ కుమార్ మరియు అధికసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## కవి సమయం

### అమ్మ ఒడి కన్న బడి మిన్న

ప్రతి మనిషికి అమ్మే తొలి గురువు. అయితే మనం అమ్మ ఒడిలో కొన్ని విషయాలనే తెలుసుకోగలుగుతాం. అదే విద్య నేర్పించే బడిలో మరిన్ని విషయాలను తెలుసుకుంటాం. నేర్చుకుంటాం. బడిలో నేర్చుకునే విద్య మన భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. కాబట్టి అందరూ బడికి వెళ్ళాలి. అయితే ఇప్పటికీ మన దేశంలో బడికి వెళ్ళని, వెళ్ళలేని పిల్లలు చాలామంది వున్నారు. కేవలం మన పిల్లలే కాదు. బడికి వెళ్లకుండా వుండే పిల్లల తల్లితండ్రులకు నచ్చచెప్పి వారి పిల్లల్ని బడికి పంపించేలా చూడాలి. ప్రభుత్వం చేసిన చట్టాలు, ఇస్తున్న ప్రోత్సాహకాలు గురించి వివరించాలి. అలా చేయడం మన అందరి సామాజిక బాధ్యత. అందరూ ఈ దిశగా తమ వంతు కృషి చేస్తారని ఆశిస్తూ ఓ శతక పద్యాన్ని ఉదహరిస్తున్నాను.

'అమ్మ ఒడిని వదిలి అడుగిడ లోకాన
భవిత దారి కలదు బడిని చేర
అమ్మ ఒడిని మించు అందాల ఒడి బడి
కంటి నలుసుర పులికంటిమాట!'

...రచయిత
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

| మాసం : ఆషాఢ; తిథి : సప్తమి ప.1.47; | బుధవారం |
| --- | --- |
| రేవతి ప.12.43; వర్జ్యము లేదు | 24-07-2019 |

**మేషం** :వ్యాపారాల్లో నూతన భాగస్వామికులను చేర్చుకునే విషయంలో పునరాలోచన అవసరం. ఎంతో కొంత పొదుపు చేద్దామన్న మీ యత్నం ఫలించక నిరుత్సాహం చెందుతారు. మీ సంతానం ఉన్నతి కోసం శ్రమిస్తారు. ప్రయాణాలు అనుకూలం. **వృషభం** : రాజకీయాల వారు కార్యకర్తల వల్ల సమస్యలను ఎదుర్కొనక తప్పదు. ఉద్యోగస్తుల కష్టాన్ని, చిత్తశుద్ధిని అధికారులు గుర్తిస్తారు. బ్యాంకుల నుంచి పెద్దమొత్తం ధనం డ్రా చేసే విషయంలో మరొకరి సాయం తీసుకోవటం క్షేమదాయకం. పట్టుదలతో శ్రమిస్తే అసాధ్యమనుకున్న పనులు పూర్తి కాగలవు. **మిథునం** : పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులు అనుకూలిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లు, ప్లీడరు గుమాస్తాలకు ఒత్తిడి తప్పదు. కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ రంగాల వారి నుంచి అభ్యంతరా లెదురవుతాయి. హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివారలకు ఒత్తిడి, చికాకులు తప్పవు. **కర్కాటకం** : ఉద్యోగస్తులకు రావలసిన అలవెన్సుల మంజూరవుతాయి. లౌక్యంగా వ్యవహరించి ఒక అవకాశాన్ని మీకు అనుకూలంగా మలుచుకుంటారు. ఏజెంట్లు, బ్రోకర్లకు, శ్రమ, పనిభారం మినహా ఆశించిన ప్రతిఫలం లభించదు. ఖర్చులు బాగా పెరిగే ఆస్కారం ఉంది. శారీరక శ్రమ వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. **సింహం** : దీర్ఘకాలిక పెట్టుబడులు, వ్యాపారాల విస్తరణలు అనుకూలిస్తాయి. సమయానికి ధనం సర్దుబాటు కాకపోవటంతో ఒకింత ఒడిదుడుకులు తప్పవు. మీ శ్రీమతికి మీరంటే ప్రత్యేకాభిమానం కలుగుతుంది. యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. **కన్య** : ప్రింటింగ్ రంగాల వారికి సమర్థులైన పనివారలతో సమస్యలు తలెత్తుతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో సత్సంబంధా లేర్పడతాయి. స్థిరాస్తి అమ్మకం విషయంలో పునరాలోచన అవసరం. తలపెట్టిన పనులు అర్థాంతంగా ముగించాల్సి వస్తుంది. మిత్రుల ద్వారా ఆశ్చర్యకరమైన విషయాలు గ్రహిస్తారు. **తుల** : నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం మంచిది. వీలైనంత వరకూ మీ పనులు మీరే చూసుకోవటం ఉత్తమం. కొంతమంది మీ విషయాల్లో అతిగా వ్యవహరించి ఇబ్బందులకు గురి చేస్తారు. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. దైవ, సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. **వృశ్చికం** : మీ హోదాకు తగినట్టుగా ధనం వెచ్చించాల్సి ఉంటుంది. రావలసిన ధనం వసూలు కాగలదు. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి ఒత్తిడి, చికాకులు అధికమవుతాయి. ఇసుక, భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆటుపోట్లు తప్పవు. ప్రింటింగ్ రంగాల వారికి ఒత్తిడి పెరుగుతుంది. స్త్రీలకు షాపింగ్ వ్యవహారాల్లో మెళుకువ అవసరం. **ధనుస్సు** : స్థిరాస్తి అమర్చుకోవాలనే మీ కోరిక నెరవేరుతుంది. పాత బాకీలు అనుకోకుండా వసూలవుతాయి. నూతన పరిచయాలు, వ్యాపకాలు అధికమవుతాయి. విదేశీ వస్తువులపై ఆకర్షితు లవుతారు. ఉమ్మడి, ఆర్థిక వ్యవహారాల్లో ఒక నిర్ణయానికి వస్తారు. మీ యత్నాలకు సన్నిహితుల సహాయ సహకారాలు లభిస్తాయి. **మకరం** : బంధువుల ఆకస్మిక రాక కొంత ఇబ్బంది కలిగిస్తుంది. తరుచు దైవ, పుణ్య కార్యాల్లో పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు అనుకూలించవు. వాహన చోదకులకు



## సువర్ణముఖి నదీ తీరమున వెలసిన శ్రీకాళహస్తీశ్వరుడు

సువర్ణముఖీ నదీ తీరమున వెలసిన ఈ స్వామి శ్రీకాళహస్తీశ్వరుడు. స్వయంభువు లింగము, లింగమునకెదురుగా వున్న దీపము లింగము నుండి వచ్చు గాలికి రెపరెపలాడును. శ్రీకాళహస్తిని దక్షిణ కాశీ అని అంటారు. ఇక్కడి అమ్మవారు జ్ఞానప్రసూనాంబ, అంబాత్రయములలో ఒకరు. శివలింగము ఇక్కడ వర్తులాకారము వలె గాక చతురస్రముగ వుంటుంది. ఇది కార్తీకమాసంలో తప్పక సందర్శించవలసిన క్షేత్రం...

స్థల పురాణాల ప్రకారం ఇది బ్రహ్మకు జ్ఞానమును ప్రసాదించిన ప్రదేశం. వశిష్ఠుడు, సాలెపురుగు, పాము, ఏనుగు, బోయడు అయిన తిన్నడు (కన్నప్ప), వేశ్య కన్యలు, యాదవ రాజు, శ్రీ కాళహస్తీశ్వర మాహాత్మ్యం వ్రాసిన దూర్జటి) వంటి వారి కథలు ఈ క్షేత్ర మహాత్మ్యంతో పెనవేసుకొని ఉన్నాయి.

కన్నప్ప అనే వేటగాడు నిత్యం స్వామిని కొలుస్తుండేవాడు . అతని భక్తిని పరీక్షించడానికి స్వామి ఒకరోజు తన కంటినుండి నెత్తురు కార్చేడట. వెం టనే కన్నప్ప తన కన్ను పీకి స్వామి కంటికి అమర్చాడట. అప్పుడు స్వామి రెండవకంటి నుండి కూడ నెత్తురు కారటం మొదలయింది. భక్తుడె%న కన్నప్ప సందేహించకుండా తన రెండవకన్ను కూడా పీకి స్వామికి అమ ర్చాడు. స్వామి ప్రత్యక్షమె% భక్తుడె%న కన్నప్పని కరుణించి ముక్తి ప్రసాదిం చాడు. ఈ దేవాలయము చాలా పెద్దది, పై కప్పుపై రంగులతో చిత్రించిన అనేకములయిన చిత్రములు వున్నాయి. మణికుండేశ్వరాఖ్య అనే మంది రమువున్నది. కాశీ క్షేత్రములో వలె ఇక్కడ చనిపోయే వారికి పరమశివుడు ఓంకార మంత్రమును, తారక మంత్రమును ఉపదేశించి మోక్షము ఇచ్చునని భక్తుల నమ్మకము. పాతాళ విఘ్నేశ్వరాలయం: దేవాలయ ప్రాంతములోనే పాతాళ విఘ్నేశ్వరాలయము కలదు. దేవాలయమునకు సమీప ములోగల కొండపై భక్త కన్నప్పకి చిన్న ఆలయము నిర్మించారు. శ్రీకాళహస్తీశ్వరాలయము రాజగోపురము యొక్క సింహద్వా రము దక్షిణాభిముఖము. స్వామి వారు ఉత్తరాభిముఖు వుంటారు. ఆదిశంకరులు ఇక్కడ శ్రీ చక్రము స్థాపించారు. ఈ క్షేత్రమునకు గల ఇతర నామములు దక్షిణ కైలాసమనియు, సత్య మహా భాస్కరక్షేత్రమనియు, సద్యోముక్తిక్షేత్రమనియు, శివానం దైక నిలయమనియు పేర్కొనటం జరిగింది. మహా శివరాత్రినాడు ఇక్కడ బ్రహ్మాండమైన ఉత్సవం జరుగుతుంది. **నాలుగు దిక్కుల దేవుళ్ళు** గుడి గర్భాలయంలోని శ్రీకాళ హస్తీ శ్వర, జ్ఞాన ప్రసూనాంబ విగ్రహాలు. శ్రీకాళహస్తీశ్వర ఆలయం నిర్మాణంలో ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ వినాయ కుడు, శ్రీకాళహస్తీ శ్వరుడు, జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు, దక్షిణా మూర్తి ఒక్కొక్కరు ఒక్కొక్క దిక్కునకు అభిముఖులె% ఉన్నారు. ఆలయ దర్శనం ద్వారా చతుర్విధ పురుషార్థ సిద్ధి లభిస్తుందనడానికి ఇది సూచన అని భక్తుల విశ్వాసం. పాతాళ గణపతి ఉత్తరాభిముఖునిగాను, జ్ఞాన ప్రసూనాంబ తూర్పు ముఖం గాను, కాళహస్తీశ్వరుడు పశ్చిమ ముఖంగాను దక్షిణామూర్తి దక్షిణ ముఖం (మహా ద్వారం ఎదురు)గాను ఉన్నారు. కాళహస్తిలోని శివలింగం పంచ లింగాలలో వాయులింగంగా ప్రసిద్ధి చెందింది. (కంచి ఏకాంబరేశ్వరుడు పృఎథ్వీలిం గము, శ్రీరంగం వద్ద జంబుకేశ్వరుడు జలలిం గము, అరుణా చలంలో తేజోలింగము, చిదం బరంలో ఆకాశలింగము). స్వామి వాయుతత్వ రూపానికి నిదర్శనంగా గర్భగుడిలోని కుడివైపున ఉన్న రెండు దీపాలు ఎప్పుడూ చలిస్తూ ఉంటాయని చెబుతారు. రాహు కేతు క్షేత్రమని ప్రసిద్ధి పొందింది. పుత్ర శోకానికి గురైన వశిష్ట మహర్షికి పరమేశ్వరుడు పంచ ముఖ నాగలింగేశ్వరునిగా దర్శన మిచ్చాడట. ఈ నాగరూపమునే బ్రహ్మ దేవుడు కూడా అర్చిం చాడట. ఈ నాగరూపం కారణంగా ఈ క్షేత్రానికి రాహు కేతు క్షేత్రము అని పేరు వచ్చింది. సర్ప దోషము, రాహు కేతు గ్రహ దోషాలనుండి నివారణ కోసం ఈ స్వామిని పూజిస్తారు.

### సంకీర్తన

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను క్లాసిఫైడ్స్ Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## గిరిజన గ్రామాలలో త్రాగు నీరు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి



పొలాల్లో బురద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

అనంతగిరి : గిరిజన గ్రామాలలో త్రాగు నీరు సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి అని పాంగిచిట్టిబాబు. జనసేన అరకులోయ పార్లమెంటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కోరారు. అనంతగిరి మండలంలోని పెదకోట పంచాయితీ లో మారు మూలలలో ఉన్న పాటిపల్లి. గ్రామాన్ని సందర్శించి అక్కడ గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



బురద నీరు త్రాగడం వలన జ్వరాలతో బాధపడుతున్న ఈశ్వరమ్మ,పెంటన్న,తదితర గ్రామస్తులు

## ప్రతిభావంతులకే అవకాశం

విజయనగరం : వార్డు వాలంటీర్ల ఇంటర్వ్యూ ప్రక్రియ మంగళవారం కొనసాగింది. పట్టణంలోని 248 మంది అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూకు హాజరు కావాలని సమాచారం అందించారు. నాలుగు బృందాలుగా అధికారులు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎస్.ఎస్.వర్మ మాట్లాడుతూ ప్రతిభ కనబరచిన అభ్యర్థులను మాత్రమే వార్డు వాలంటీర్ల పోస్టులకు ఎంపిక చేస్తున్నామన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిడులు లేకుండా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థుల చదువు, సామాజిక స్పృహ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని మార్కులు వేస్తున్నామన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రోస్టర్ పద్ధతిలో ఎంపికైన వాలంటీర్లను ఆగస్టు మొదటి వారంలో ప్రకటిస్తామన్నారు. వారికి శిక్షణ అందించిన అనంతరం ఆగస్టు 15వ తేదీ నుండి వార్డు వాలంటీర్లు తమ విధులను నిర్వర్తిస్తారన్నారు.

## గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏర్పాటు

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులుగా టి.శివకేశవరావు, ప్రధాన కార్యదర్శిగా సముద్రాల గురుప్రసాద్, కోశాధికారిగా గోటేటి హిమబిందు, ఉపాధ్యక్షులుగా బెలగాం భీమేశ్వరరావు, ఎం సుభద్రాదేవి, దన్నాన అప్పలనాయుడు, బొంతలకోటి శంకరరావు, కార్య దర్శులుగా ఎం సుశీల, డాక్టర్ ఆర్ ఎస్ వరహాలదొర, సహాయ కార్యదర్శిగా తాడెల మన్మధరావు, కార్యవర్గ సభ్యులుగా కంచర్ల రాజేశ్వరరావు, డాక్టర్ జివిఎన్ భూపతి, పిన్నింటి కళావతి, ఎం.ఫకీరునాయుడు,ఎ.కైలాసరావు, ఆర్.వాసుదేవరావు, పాపు నాయుడులు ఎంపికైన నేపథ్యంలో సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ డాక్టర్ డొల్లు పారినాయుడు ఆదివారం ఉదయం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని అభినందించారు. విజయవాడలో గల రాష్ట్ర శాఖ నూతనంగా జిల్లా శాఖ కార్యవర్గాన్ని ప్రకటించిన నేపథ్యంలో త్వరలోనే జిల్లాలో అన్ని మండలాలలోను కన్వీనర్లను ఏర్పాటు చేసి సభ్యత్వాలను ఎక్కువగా పెంచాలని గ్రంథాలయ ఉద్యమాన్ని జిల్లా నలుమూలలా వ్యాప్తిచేయాలని అధ్యక్షులు శివకేశవరావు సూచించారు.

## ప్రజా వైద్యులు సుసర్ల మృతి



విజయనగరం: వైద్యోనారాయణో హరి అన్న ఆరోక్తికి నిలువెత్తు నిదర్శనం వారు. నిరంతరం అస్వస్థులను, పీడితులను అక్కున చేర్చుకుని తన వృత్తిరీత్యా ఉన్న అనుభవంతో వారికి చేదోడువాదోడుగా ఉంటూ వైద్యం... వృత్తి కాదు నా ప్రవృత్తి అని చాటి చెప్పారు. తన 80వ ఏట కూడా వైద్య సేవలు ఉచితంగా అందిస్తూ తుదిశ్వాస విడిచారు. సుమారు 5 వేల మందికి వివిధ శస్త్రచికిత్సలు చాలా నామమాత్రపు రుసుముకే చేసేరు. అంతేకాకుండా ప్రతిరోజూ పేదలకోసం ఉచిత వైద్యశిబిరాన్ని సత్యసాయి మందిరం (స్థానిక ఓం మందిరం) వద్ద నిర్వహించి ఎందరికో స్ఫూర్తినిచ్చారు. ప్రేమసమాజం(విజయనగరం) రాష్ట్రీయ బ్రాహ్మణ జాగృతి (హైదరాబాద్) లలో కూడా ఉచిత వైద్యశిబిరాలు ప్రతి వారానికి మూడురోజులు నిర్వహించేవారు. వారి మరణం పట్ల వారి సమకాలిక వైద్యులు, ఐఎంఏ సభ్యులు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్ (విజయనగరం), చాడా సన్యాసి ధర్మారావు (విజయవాడ), భాస్కర భట్ల సూర్య ప్రకాశరావు (విజయనగరం), చాడా సత్య శ్రీనివాస్(హైదరాబాద్) భాస్కరభట్ల వెంకట ప్రభాకర్, సంతాపం ప్రకటించిన వారిలో తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న ఇగ్నో అడ్మిషన్లు

నెలాఖరు వరకూ గడవు
ఆన్‌లైన్ విధానం ద్వారానే అడ్మిషన్లు.
ఎస్.సి/ఎస్.టిలకు అడ్మిషన్ ఫీజు మినహాయింపు

విశాఖపట్నం : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) జూలై 2019 కి గాను అందించే అన్ని సర్టిఫికేట్, డిప్లొమా, డిగ్రీ, పి.జి. కోర్సులలో ప్రవేశాలకి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. సర్టిఫికేట్, డిప్లొమా, పి.జి.డిప్లొమా, డిగ్రీ మరియు పి.జి. కోర్సులలో ప్రవేశాలకు చివరితేదీ 31.07.2019. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో అనగా ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లా మరియు యానాం లలో నివసించే అభ్యర్దులు ఆన్లైన్ విధానంలో కింద ఇవ్వబడిన లింక్ క్లిక్ చేసి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

**వివరాల కోసం :** ఉషోదయ జంక్షన్, ఎర్విల్లి కాలనీ లో వున్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని 0891-2511200/300 ఫోన్ నంబర్స్ ద్వారా సంప్రదించవచ్చు rcvisakhapatnamignou.ac.in ఈ మెయిలు ద్వారా సంప్రదించవచ్చు.

## 27లోగా ఇసుక తరలింపు వాహనాల నెంబర్లు నమోదు

విజయనగరం : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఇసుక విధాన చట్టం ప్రకారం జిల్లాలో ఇసుక తరలించటానికి ఆసక్తి కల్గిన లారీ యజమానులు, ట్రాక్టర్ ట్రైయిలర్ యజమానులు ఈ నెల 27వ తేదీ లోగా రవాణా శాఖ ఉప కమిషన్ ఆఫీసులో కానీ, భూగర్భ గనుల శాఖ కార్యాలయంలో గానీ వారి వాహనాల నెంబర్లు , పేర్లు నమోదు చేసుకోవాలని రవాణా శాఖ ఉప కమిషనర్ సి.హెచ్ శ్రీదేవి తెలిపారు. ఏ వాహనమైతే ఇసుక తరలించటానికి ఏర్పాటే చేశారో దానికి తప్పని సరిగ జి.పిఎస్ పరికరం అమర్చుకోవాలని సూచించారు.

## పెద్దాపురంలో దొంగల బెడద

పెద్దాపురం : పట్టణంలో గత 3 రోజులుగా జరుగుతున్న వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మారుతీనగర్‌లో జరిగిన చోరీ మరువక ముందే సోమవారం తెల్లవారుజామున స్థానిక బ్యాంకు కాలనీలో గల మూడు ఇండ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడినట్లు సమాచరం. అయితే అదే కాలనీలో రెండు ఇండ్లలో చోరీకి యత్నించిన గుర్తు తెలియని దుండగులు, కాలనీలో వుంటున్న సురేష్ అనే వ్యక్తి ఇంట్లో చొరబడి 13 గ్రాముల బంగారం, రూ.15వేలు నగదు, ఒక మొబైల్ దొంగిలించినట్లు సురేష్ చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## నీటిపారుదల శాఖలో నీరుగారిని పరిశుభ్రత : కలెక్టర్ అసహనం



విజయనగరం : జ్రిల్లా కలక్టర్ కార్యాలయానికి సమీపాన ఉన్న నీటిపారుదల శాఖ కార్యలయాన్ని జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనికిరాని వస్తువులన్నీ గదుల్లో ఉంచడం, డిఇఇ గదిలో మంచాలు, టైర్లు, ఇతర వ్యర్థపదార్థాలు సాయగ్రి ఉంచడంతో అసంతృప్తినరి వ్యక్తం చేశారు. కనీసం కార్యాలయ ఆవరణలో చాలా ఖాళీ స్థలం ఉన్నా మొక్కలు కనీసంగా పెంచకపోవడం పట్ల అసహనం వ్యక్తపర్చారు.

## పొడిగించిన ఇంటర్వ్యూల తేదీలు

పెద్దాపురం : పెద్దాపురం మండల ప్రజా పరిషత్ పరిధిలోని వివిధ గ్రామాల నుండి ఈనెల 11వతేదీ నుండి 23 వరకు నిర్వహించబడిన గ్రామ వాలంటీర్ల ఇంటర్వ్యూలకు, వారికి కేటా యించిన తేదీలలో హాజరుకాని అభ్యర్థులకు ఈనెల 24, 25 తేదీలలో రెండురోజులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పెద్దాపురం మండల ప్రజా పరిషత్ కార్యా లయంలో ఇంటర్వ్యూలు నిర్వహించబడునని, మండల ప్రజా పరిషత్ అధికారి రమణారెడ్డి తెలిపారు. కావున దరఖాస్తుదారులు వారి అర్హత సర్టిఫికెట్లు (ఒరిజినల్)తో హాజరు కావలసినదిగా తెలిపారు.

## పచ్చని మొక్కలతో అందరికీ ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్



విజయనగరం : పచ్చని మొక్కలు, వృక్షాలతో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అందరికీ ఆరోగ్యం ఉంటుందని జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ అన్నారు. స్థానిక దుప్పాడ శ్రీక్షేత్రం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృక్షాలు ఎక్కువగా వుంటేనే వాతావరణంలో సమతుల్యత ఏర్పడి, సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. మొక్కలు పెంపకం, వర్షపునీటి సంరక్షణ, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, అటవీశాఖ అధికారులు లక్ష్మణరావు, జానకీరామ్, రాజశేఖర్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమానికి కృషి చేయాలని రాష్ట్ర బీసీ శాఖామాత్యులు శంకర నారాయణను కోరిన బీసీ సెల్ అధ్యక్షులు కొటాన రాము



సబ్బవరం : రాష్ట్రంలో బిసిల సంక్షేమానికి కృషి చేయాలని బిసి శాఖామాత్యులు శంకరనారాయణను కోరిన విశాఖ బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము, రామన్నపాత్రుడు రాష్ట్ర రాజధాని అమరావతిలో వైసీపీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి బిసిలకు పెద్ద పీట వేసారు. అసెంబ్లీలో బిసిలకు 5 బిల్లులు ప్రవేశపెట్టారు. బిసి మంత్రి శంకరనారాయణ ద్వారా అసెంబ్లీలలో పెట్టారు. ఈ సందర్భంగా విజయవాడలో సోమవారం బిసి సంక్షేమ శాఖామాత్యులకు ఆయన ఛాంబర్‌లో రాష్ట్ర బిసి నాయకులంతా ఘనంగా సన్మానించిఅభినందనలు తెలిపారు. మంత్రి వర్యులను అభినంధించిన వారిలో రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి, మాజీ మంత్రివర్యులు నర్సయ్య గౌడ్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొయ్య ప్రసాదరెడ్డి, అనకాపల్లి పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము, రామన్నపాత్రుడు, ఇతర వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండల పంచాయతీ కార్యదర్శుల యూనియన్ ప్రెసిడెంట్ గా లింగన్న



దేవరాపల్లి : మండల పంచాయతీ కార్యదర్శుల ఎన్నికలలో మండల కార్యదర్శులు యూనియన్ ప్రెసిడెంట్ గా ఎల్. లింగన్న ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఆర్గనైజింగ్ సెక్రటరి జి. సత్య ప్రసాద్ అధ్యక్షతన జరిగిన మండల పంచాయతీ ప్రెసెంట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.మండల పంచాయతీ కార్యదర్శుల యూని యన్ ప్రిసిడెంట్‌గా ఎల్. లింగన్న అలాగే వైస్ ప్రెసిడెంట్గా ఎస్. అనురాధ ,జనరల్ సెక్రెటరీగా ఎంఎస్ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీగా శివప్రసాద్, ట్రెజరర్ గా జీ. ఎస్. నళిని,లను కార్యవర్గ సభ్యులు ఎన్. సురేష్, ఆర్. కె. రెడ్డి, వి .యశోద, జె. ప్రసాద్, బి.వి. సత్యనారాయణ, కె. చంద్రకళ ,అప్పారావు ,లు ఏకగ్రీవంగా వీరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన లింగన్న మాట్లాడుతూ, మండల ప్రెసిడెంట్ గా బాధ్యతలు అప్పగించి నందుకు సంఘ సభ్యులకు ధన్య వాదాలు తెలియజేశారు.

అలాగే కార్యదర్శులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు నడుస్తామని తెలియజేశారు.

## సమీకృత వ్యవసాయానికి కేంద్రం సాయం: ఫిషరీస్ సీనియర్ ఎక్స్‌పర్ట్ రత్నమాచారి



విజయనగరం : ప్రపంచబ్యాంకు ఆర్థిక సహభకారంతో రాష్ట్ర సమీకృత సాగునీరు, వయవసాయ పరివర్తన పథకాన్ని విజయ నగరం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాలో అమలు చేస్తున్నాదని, సీనియర్ ఫిషరీస్ ఎక్స్‌పర్ట్ సి.రత్నమాచారి తెలిపారు. మంగళవారం స్థానిక కృషిభవన్‌లో మూడు జిల్లాలకు చెందిన మత్స్యకార సహకార సంఘాల సభ్యులు, సంబంధిత సిబ్బందితో 'వాతావరణ అనుకూల చేపల ఉత్పత్తిపై' సదస్సు జరిగింది. సదస్సులో ఆయన మాట్లాడుతూ 1600 కోట్లు రూపాయలు రపపంచ బ్యాంకు అందిస్తోందని చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు 104.3 కోట్లు కేటాయించడం అయిందని తెలిపారు. నీరు నిల్వ ఉంటే పరిస్థితిని బట్టి 30 శాతం సాగునీరు చెరువుల్లో చేపల సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆర్థికగా చక్కని అవకావాలున్నాయన్నారు. మంచినీటి చేపల ఉత్పత్తి, పెట్టుబడి అనంతరం జ్గాత్తలు, మార్కెంటింగ్ సౌకర్యాలు, మత్స్యకారుల సామర్థ్యం పెంపుదల, సహకార సంఘాల బలోపేతం తదితర అంశాలపై శిక్షణా బిబిరాన్ని నిర్వహించేరు. ఫిష్ లేండింగ్ కేంద్రం అభివృద్ధి, ప్రాసెసింగ్ యూనిట్, సాంకేతికత అంవాలపై అవగాభదీహన ఉండాలని వివరించారు. దేశంలోని చేపల ఉత్పత్తిలో 35 శాతం ఉత్పత్తి ఆంధ్రరాష్ట్రం నుంచే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐఎటిసి డిపిఓ ఎస్.వి.రమణారావు, ఐఆర్పిడబ్ల్యుఎ సపోర్ట్ ఆర్గనైజేషన్ సిఇఓ పి.కె.ప్రకాష్ వ్యవసాయ బిజినెస్ ఎక్‌సపర్ట్ పి.ఎం.యు మస్తాన్‌రావు, మత్స్య శాఖ ఉప సంచాలకులు ఎం.దివాకర్, శ్రీకాకుళం, విశాఖ మత్స్య శాఖ సహాయ సంచాలకులు పి.వి.శ్రీనివాసరావు, టి.సుమలత, సమాచార సహాయ సంచాలకులు డి.రమేష్, జియాలజిస్టు జి.శ్రీనివాసరావు, విజయనగరం, విశాఖ ఎప్డిఓ డి.మురళి, శ్రీనివాస రావు, టాటా ట్రస్ట్ ప్రతినిధి పద్మాకర్, మూడు జిల్లాల ఎపిడిలు, సహాయ సిబ్బంది సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ సంచుల విక్రయం, వినియోగంపై ఆకస్మిక తనిఖీలు



విజయనగరం : విజయ నగరం పట్టణం లోని పలు ప్రాంతాల్లో ఉన్న వ్యాపార సంస్థలపై మంగళవారం కార్పొరేషన్ పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు స్వాధీనం చేసుకున్నారు. వ్యాపార సంస్థలకు జరీ మానా విధించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పర్యావరణ ఇంజనీర్ వెంకటరమణ మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పుగా వాటిల్లిన ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఎన్ని విధాలుగా ప్రచారం చేసినా ఇంకా పలువురు వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను అమ్ముతూనే ఉన్నా రన్నారు. మరికొందరు కవర్లను వినియోగిస్తున్నారన్నారు. ఇకపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తా మని, పట్టుబడితే భారీగా జరిమానా విధించడంతో పాటు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.

## ప్రజ్ఞాశాలి - వితరణశీలి అయ్యంకి వెంకటరమణయ్య - డాక్టర్ రేణుక



విజయనగరం: గ్రంథాలయ ఉద్యమ పితామహులు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని, తన ఆస్తిలో 10 ఎకరాలు ప్రజలకు ఇచ్చివేసిన వితరణ శీలి అని విజయనగరం మహారాజా అటానమస్ కళాశాల గ్రంథ పాలకురాలు, రీడర్, డాక్టర్ పి.రేణుక అన్నారు. అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గ్రంథా లయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కోటలో గల మహారాజా డిగ్రీ కళాశాలలో (పూర్వ మహిళా కళాశాలలో) ఏర్పాటు చేసిన సభకు ప్రధానవక్తగా పాల్గొని మాట్లాడుతూ అఖిల భారత గ్రంథాలయ సమావేశాలుకు రవీంద్రనాథ్ ఠాగూర్, పి.సి.రాయ్, దేశబంధు చిత్తరంజన్ దాస్ వంటి ప్రముఖులను పిలిచి గ్రంథాలయ ఉద్యమానికి అయ్యంకి ప్రాచుర్యాన్ని కల్పించారని, తొలి తెలుగు గ్రంథాలయ విజ్ఞాన పత్రిక గ్రంథాలయ సర్వస్వంను ప్రారంభించారని, ఆల్ ఇండియా సిటిజన్స్ లైబ్రరీ అసోసియేషన్‌ను స్థాపించారని అన్నారు. అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సముద్రాల గురుప్రసాద్‌తో కలసి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ నాగమణి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయలక్ష్మిలు డాక్టర్ రేణుకను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంథపాలనాధికారి పి.ఉదయకుమారి, సంఘం ఉపాధ్యక్షురాలు సుభద్రాదేవి, హిమబిందు, సూర్యకాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 25న టీచర్ల పోస్టులకు వాక్ ఆన్ ఇంటర్వ్యూ

విజయనగరం : జిల్లాలో ఉన్న పది సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళా3శాలల్లో వివిధ సబ్జెక్టులలో టీచర్ పోస్లులు తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు వాక్ ఆన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటి కో-ఆర్డినేటర్ తెలిపారు.

గెస్ట్ టీచర్ల భర్తీకోసం తెలుగు-3, ఆంగ్లం-2, గణితం-2, ఫిజిక్స్-2, బయో సైన్స్-1, ఎకనామిక్స్-1 సబ్జెక్టుల్లో ఈ భర్తీ జరుగుతుందని తెలిపారు. మహిళా అభ్యర్థులకు ఈ అవకాశం ఉందని అలాగే ఇంగ్లీషులో ఇద్దరుకు పనురుషుల అభ్యర్థులే ఎంపికకాబడతారని తెలిపారు. ఇతర వివరాలకు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల, కొప్పెర్ల విజయనగరం జిల్లా చిరునామాలో ఈనెల 25వ తేదీ ఉదయం 10 గంటకు పిజీ, బిఎడ్ అర్హత గల అభ్యర్థులు డెమో మరియు వాక్ ఆన్ ఇంటర్వ్యూకి హాజరుకావాలని తెలిపారు.

# కె కె రాజు ను కలసిన జి వి ఎం సి కాంట్రాక్టర్లు అసోసియేషన్ సభ్యులు



విశాఖపట్నం :ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జి వి ఎం సి కొత్తగా ఎన్నికైన కాంట్రాక్టర్లు అసోసియేషన్ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్. వావిలపల్లి సత్యనారాయణ, సెక్రటరీ. జీ చంద్రమౌళి, వై.. సెక్రటరీ. పి ఎస్ ప్రసాద్, సిహెచ్ బుల్లిబాబు, కె నారాయణరావు, పైడి వెంకట సత్యం, ఆ ర్ నర్సింగరావు, సిహెచ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఆన్ లైన్ మోసాలపై ఎక్కడైనా కేసు వేయవచ్చు.. ప్రచార కార్యకర్తలూ బాధ్యులే .!

## -రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడు కాంద్రేగుల వెంకటరమణ

దేవరాపల్లి, : ఆన్ లైన్ లో కొనుగోలు చేసిన వస్తు సేవల్లో లోపాలుంటే ప్రాంతంతో సంబంధం లేదు ఎక్కడైనా కేసు వేయవచ్చని రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ విజిలెన్స్ కమిటీ సభ్యుడు జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాంద్రేగుల వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిజిటల్ లావాదేవీలు వినియోగదారుల హక్కులు పై జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం వివిధ ఉత్పత్తులు ,వాణిజ్య సంస్థల ప్రచారకర్తలు కూడా ఆ ప్రకటనలోని అంశాలకు బాధ్యులన్నారు. పలానా సినిమా స్టార్ చెప్పారు. కదా అని నమ్మి డబ్బుతో కొనుగోలు చేసిన వారు మోసపోయామని కేసు పెడితే సదరు స్టార్ కూడా చిక్కుల్లో పడక తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఆన్లైన్లో కొనుగోలు చేసిన వస్తువు సకాలంలో బట్వాడా కాకపోవడం నకిలీ వస్తువులు రావడం గ్యారెంటీ, వారంటీ, పత్రాలు లేకపోవడం ఇలా వివిధ రకాల సమస్యలు వినియోగదారులు చట్ట పరిధిలోకి వస్తాయన్నారు ఆన్లైన్లో విక్రయించే వస్తువులు ప్యాకెట్పై గరిష్ట చిల్లర ధర (ఎంఆర్ పి)తయారీ తేదీ, చిరునామా, ఎక్స్ పైరీ తేదీ, కస్టమర్ కేర్, నికర పరిమాణం, తయారైన దేశం వివరాలు, మొదలుకు సమాచారం ఉండాలన్నారు. ఎస్ ఎస్ ఎల్( ఎల్ సెక్యూర్ సాకెట్స్ లేయర్) ఉన్న ఈ కామర్స్ వెబ్సైట్లో ఆన్లైన్ షాపింగ్ చేయడం సురక్షితమన్నారు. షాపింగ్ కు సంబంధించిన ఆన్లైన్ లావాదేవీలను ప్రింట్ రూపంలో భద్రంగా దాచుకోవాలన్నారు వస్తువులు సరఫరా వస్తువుల్లో నాణ్యత లోపం మొదలగు సమస్యలతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులు ఫోరాల ను ఆశ్రయించాలని విజ్ఞప్తి చేశారు. వినియోగదారులను తప్పుదోవ పట్టించే ప్రకటనల సమాచారాన్ని జిఏఎం ఏ పోర్టులకు ఫిర్యాదు చేయాలని కాంద్రేగుల విజ్ఞప్తి చేశారు. ప్రశ్నిస్తేనే మోసాలు తగ్గుతాయని చెప్పారు ఈ సందర్భంగా ఆన్లైన్ మార్కెటింగ్ మోసాలు పరిష్కారాలు వినియోగదారుల వ్యవహారాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, జాతీయ ,రాష్ట్ర వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు మోక్షాలు, వివాదాల ప్రత్యామ్నాయ పరిష్కార పరిష్కారాల వేదికలు అంశాల గురించి సమగ్రంగా వివరించారు .అనంతరం కళాశాల ప్రిన్సిపల్ టి. స్వర్ణలత మాట్లాడుతూ, విద్యార్థులు వినియోగదారుల హక్కులు సామాజిక అంశాలు సమస్యలు పరిష్కారాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా మోసాలు నిరోధించవచ్చన్నారు. భవిష్యత్తులో వినియోగదారుల వ్యవహారాలకు సంబంధించిన ప్రతి శాఖ సేవలపై సమావేశాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులను చైతన్య వంతులగా తీర్చిదిద్దామన్నారు. ఆన్లైన్లో వస్తువులు కొనుగోలు చేసే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు వస్తువుల డెలివరీలో లోపాలు పరిష్కారాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు .

# నేటితో ముగియనున్న వాలంటీర్ల ఇంటర్వ్యూలు



దేవరాపల్లి :- మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గత పది రోజుల నుంచి జరుగుతున్న గ్రామ వాలంటీర్ల ఇంటర్వ్యూలు బుధవారంతో ముగియనున్నట్లు ఎంపీడీఓ సి హెచ్ .సుబ్బాలక్ష్మి తెలిపారు .గ్రామ వాలంటీర్ల కోసం మండలంలోని 27 గ్రామ పంచాయతీల నుంచి 1790 మంది ఆన్ లైన్లో దరఖాస్తులు చేసుకోగా 1789 మందిని ఇంటర్వ్యూలకు ఆహ్వానించామన్నారు .అందులో 1189 మంది మాత్రమే ఇంటర్యులకు హాజరైయ్యారన్నారు .600 మంది హాజరుకాలేదన్నారు .బుధవారం ఒకే ఒక అభ్యర్థి ఇంటర్యూతో ఈ ప్రక్రియ ముగుస్తుందని ఎంపీడీఓ తెలిపారు .

# ఉగాదినాటికి పేదలకు ఇళ్ల స్థలాలు

- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- గృహ నిర్మాణాల కొరకు 5 కోట్లు కేటాయింపు
- కుటుంబ మహిళ పేరుతో పట్టా కేటాయింపు చేయాలి
- రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి




శ్రీకాకుళం: ఇళ్ళు లేని నిరుపేదలందరికీ వచ్చే ఉగాది నాటికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఇళ్ల స్థలాల పంపిణీ, స్పందన, వసతి గృహాలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణాలు తదితర అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇళ్ల స్థలాల పంపిణీ, గృహనిర్మాణాల కొరకు రూ.5 వేల కోట్లను బడ్జెట్ లో కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. కుటుంబ మహిళ పేరుతో పట్టాను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను ఆదేశించారు. గ్రామాన్ని యూనిట్ గా తీసుకోవాలని, 25 లక్షల గృహాలు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. స్పందనపై మాట్లాడుతూ విద్యా సంస్థలు, వసతి గృహాల్లో పరిస్థితులు మెరుగుపడాలని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యట నలో భాగంగా విద్యాసంస్థల్లో మౌలిక సదుపా యాల కల్పనకు ప్రకటించిన రూ.14 కోట్లలో రూ.7 కోట్ల చొప్పున ముందస్తుగా నిధులు విడుదల చేయడం జరిగిందని అన్నారు.



వసతి గృహాలు, పాఠశాలాల్లో మురుగునీటి శుద్ధిప్లాంట్, ఆర్.ఓ.ప్లాంట్ ఏర్పాటు చేయాలని, కొన్ని చోట్ల అవి పనిచేయకుండా ఉన్నాయని, అటువంటి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేసారు. స్పందన సమస్యలకు నాణ్యమైన పరిష్కారం ఉండాలని, అవినీతి రహిత వ్యవస్థ ఆవిష్కృతం కావాలని వివరించారు. ఇసుక కొరత లేకుండా చూడాలని, అదే సమయంలో అవినీతి ఎక్కడా ఉండరాదని అన్నారు. సెప్టెంబర్ లో కొత్త ఇసుక విధానం వస్తుందని తెలిపారు. కరెంటు కోతలు ఎక్కడా ఉండరాదని, వర్షాకాలానికి ముందు చేసే నిర్వహణ పనులు ఆలస్యంగా చేపట్టడం వలన విద్యుత్ కోతలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇసుక, విద్యుత్ పై ప్రత్యేక దృష్టిని సారించాలని చెప్పారు. గ్రామ సచివాలయం ఉద్యోగాలకు 25న నోటిఫికేషన్ ఇవ్వాలని, సెప్టెంబర్ 20 నాటికి భర్తీ ప్రక్రియ పూర్తికావాలని అన్నారు. అక్టోబర్ 2వ తేదీ నుండి విధుల నిర్వహణ ఉండాలన్నారు. 72 గంటల్లో రేషన్ కార్డు జారీ వంటి అంశాలతో పాటు ప్రజల అవసరాలను గ్రామ సచివాలయాల ద్వారా పరిష్కరించాలనేదే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్పందనలో వచ్చే భూతగాదాలను నిశితంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జె. నివాస్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వ స్థలాలను గుర్తించామని, లే అవుట్ వేసి చక్కని కాలనీలుగా తీర్చిదిద్దుటకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇళ్ల పట్టాలు పంపిణీకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అర్హులైన వారికి అందుటకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో సహాయ కలెక్టర్ భార్గవ్ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి కె.నరేంద్ర ప్రసాద్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి టి.కైలాష్ గిరీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రయాన్ నూటముప్పై కోట్ల భారతీయుల విజయం - చిలుకూరి



అన్నవరం.... తూ.గో.జిల్లా శంఖవరం మండలంలో జరిగిన బీజేపీ కార్యవర్గ సమావేశంలో చంద్రయాన్- 2 ప్రయోగం విజయవంతం అవ్వడం పట్ల బీజేపీ నాయకులు ఐకార్ సభ్యులు చిలుకూరి.రామ్ కుమార్ మరియు శంఖవరం మండల ప్రదాన కార్యదర్శి పడాల. నాగు సంయుక్తంగా హర్షం వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్తిపాడు నియోజకవర్గం తరుపున శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామ్ కుమార్ మట్లాడుతూ చంద్రయాన్ విజయం నూటముప్పై కోట్ల భారతీయుల విజయమన్నారు.చంద్రయాన్ ప్రయోగం విజయంతో ప్రపంచంలో 'క్రయోజనికి టెక్నాలిజీ' వినియోజించే కొన్నిదేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత మన శాస్త్రవేత్తలకు దక్కిందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆనందం వ్యక్తం చేసారు.

## ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ స్కూల్స్ ను సందర్శించిన మానవ హక్కుల మిషన్ సభ్యులు

అన్నవరం..... తూ.గో.జిల్లా రౌతుల పూడి మండలం లో గల ములగపూడిలో గల ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ హాస్టల్,గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలను మంగళవారం మానవ హక్కుల మిషన్ సభ్యులు తూర్పుగోదావరి జిల్లా లీగల్ కార్యదర్శి ఎస్సీ,ఎస్టీ మోనారింటింగ్ పెద్దాపురం డివిజన్ సభ్యులు,న్యాయవాది పిల్లి. బలరాముడు,మానవ హక్కుల మిషన్ రాష్ట్ర మెంబర్స్ న్యాయవాది పలివెల .నాగేంద్రరాజు, ఇండుగపల్లి. నూకరాజు,అబ్బిరెడ్డి. నారాయణ రెడ్డి,టి.గణేష్ తదితరులు ప్రభుత్వ సంక్షేమ స్కూల్స్ లను సందర్శించి విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారు అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు, ఇందులోభాగంగా ములగపూడి హాస్టల్ పూర్తిగా పారిశుధ్యం లోపించి,మిడ్డే మీల్స్ కాంట్రాక్టు వలన 300 వందల భోజనాలు బదులు 150 బోజనాలతో సరిపెట్టే పరిస్థితి స్థానిక హైస్కూలులో ఉన్నది,అలాగే స్కూల్స్ కు రక్షణ లేని పరిస్థితి విషమంగా ఉందని, అలాగే గురుకులము లో పిల్లలకు రక్షణ బాగానే వుందని ప్రభుత్వం మాత్రం పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనలో,డిపార్టుమెంటు జిల్లా,డివిజన్ అధికారులతో సహా పూర్తిగా నిర్లక్యంతో విఫలమైందని,గత 3 సంవత్సరాలుగా మంచి నీటి కోసం,మరుగు దొడ్డులు కోసం,ప్లాంటు అవసరం కోసం,భోజనాల శాల ఇతర సదుపాయాలు కోసం స్థానిక అధికారులు దృష్టికి తీసికొని వెళ్లిన ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం చేసినట్లుగా గుర్తించడమైనది కావున దీనిని కలక్టర్ వారికి నివేదన,గత నిధులు మంజూరు చేసిన విధానం మీద చర్యలు తీసుకొనేందుకు సిద్ధంగా మిషన్ ఉందని కావున తక్షణమే ఈ సమస్యలు15 రోజులలో పరిస్కారం చేయాలి అని కోరుతూ,డిమాండ్ చేసారు.

# ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

( మొదటి పేజీ తరువాయి )

ప్రభుత్వ అభివృద్ధి పథకాలు చూసి మరియు జిల్లా పోలీస్ పార్టీలు తమ గ్రామాలకు వచ్చి గ్రామ పెద్దలతో మాట్లాడి భరోసా ఇవ్వడం వలన స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు రేంజ్ డీఐజీ కాళిదాసు వెంకట రంగారావు తెలియజేశారు.

### లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు

పాంగి తలొ లింబో తండ్రి కుమార్ 28 సంవత్సరాలు, కోందు, పదకొండ గ్రామం, లక్కవరపు పేట పంచాయతీ, జీకే వీధి మండలం. ఏరియా కమిటీ మెంబరు గాలికొండ , కోరుకొండ మరియు గుర్రేడు దళాలల్లో పనిచేసింది. ఈమెపై రూ.4 లక్షలు ప్రభుత్వ రివార్డు ఉంది. 2006 సంవత్సరం నుండి 2019 వరకు మావోయిస్టులతో పని చేసింది , మధ్యలో 2012 సంవత్సరంలో ఒక సంవత్సరకాలం తన గ్రామంలో ఇంటివద్ద నివాసం ఉంది. పాల్గొన్న నేరాలుః 2013 సంవత్సరంలో జీ.కి. వీధి మండలం పనసబంధ వద్ద గెమ్మిలి చిన్నారావును హత్య చేసిన సంఘటనలో పాల్గొంది. 2013వ సంవత్సరంలో జీ.కే. వీధి మండలం బోనంగిపల్లి గ్రామము వద్ద రాజబాబును రాజు ను హత్య చేసిన సంఘటనలో పాల్గొంది. మల్కాన్ గిరి జిల్లా నాగులూరు గ్రామం వద్ద గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసిన సంఘటన లో పాల్గొంది. 2008వ సంవత్సరంలో ఒరిస్సా రాష్ట్రం గుమ్మ వద్ద ఎదురుకాల్పులు సంఘటనలో పాల్గొంది. 2010వ సంవత్సరంలో చింతపల్లి మండలం చెరువూరు గ్రామం వద్ద కాల్పుల సంఘటన పాల్గొంది. 2015 సంవత్సరంలో కొయ్యూరు మండలం తీగలమెట్ట వద్ద ఎదురుకాల్పులు సంఘటనలో పాల్గొంది. 2016 సంవత్సరంలో కొయ్యూరు మండలం మర్రిపాకలు - పాలసముద్రం మధ్య ఎదురుకాల్పులు సంఘటనలో పాల్గొంది. . 2018 సంవత్సరంలో ఒరిస్సా రాష్ట్రం చిత్రకొండ పీఎస్ పరిధిలో జుడుంటో- తిక్కరపాడు వద్ద ఎదురుకాల్పులు సంఘటనలో పాల్గొంది. 2019 సంవత్సరంలో తూర్పుగోదావరి జిల్లా గుర్తెడు పీఎస్ పరిధి చోప్పకుండ వద్ద ఎదురుకాల్పులు సంఘటనలో పాల్గొంది. ఒరిస్సా రాష్ట్రం, రంగినీగూడ, మాసాలముండి,పాలగరువు వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో సంఘటనలో పాల్గొంది. 2010వ సంవత్సరంలో చింతపల్లి మండలం కోరుకొండ వద్ద మందుపాతర పేల్చి వ్యానును కాల్చివేసిన సంఘటనలో పాల్గొంది. 2015 సంవత్సరంలో జి.మాడుగుల మండలం గుదలంవీధి ఆశ్రమంను ధ్వంసం చేసిన సంఘటనలో పాల్గొంది. 2017 సంవత్సరంలో జీ.కె. వీధి మండలం, కుంకుమ పూడి వద్ద జెసిబిని దగ్ధం చేసిన సంఘటనలో పాల్గొంది. 2015 సంవత్సరంలో జీ .కె. వీధి మండలం , గొందిపల్లి గ్రామం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు అయినా ముక్కల మహేష్ ఎం.బాలయ్య, వి.బాలయ్యను అపహరించిన సంఘటనలో పాల్గొంది. ఏటులం, గుదలంవీధి గ్రామాలలో జరిగిన కరువు దాడి సంఘటనలో పాల్గొంది. ఒరిస్సా రాష్ట్రం ధామండోడి పోలీసు క్యాంపుపై దాడిచేసిన సంఘటనలో పాల్గొంది. బలిమెలలో పోలీసులు ప్రయాణిస్తున్న లాంచీని ముంచివేసిన సంఘటనలో పాల్గొంది. వంతల మంగమ్మ అలియాస్ జానకి తండ్రి: రమణ 34 సంవత్సరాలు, పొందూరు గ్రామం, జీకే వీధి మండలం. సీపీఐ మావోయిస్టు గాలికొండ,కోరుకొండ మరియు గుర్రేడు దళాలల్లో పనిచేసింది. ఈమె పై రూ. 4 లక్షలు ప్రభుత్వ రివార్డు ఉంది. 2011-12 సంవత్సరాలలో మిలీషియాగా, 2013 నుండి 2017 వరకు దళం మెంబర్ గా , 2017-2019 వరకు ఏరియా కమిటీనెంబరు గా మరియు డిప్యూటీ కమాండరుగా పలకజీడి ఏరియాలో పనిచేసింది . పాల్గొన్న నేరాలు 2014వ సంవత్సరంలో తూర్పుగోదావరి జిల్లా, వై.రామవరం పీఎస్ పరిధిలో ఎంతలనరేష్ జంగాలతోట వద్ద హత్య చేసిన సంఘటనలో పాల్గొంది. ఒడిశా రాష్ట్రం సింగరాయి గొంది వద్ద ఆనంద్ ను హత్య చేసిన సంఘటన లో పాల్గొంది. 2018 సంవత్సరంలో జీ.కె. వీధి మండలం, చుక్కగొయ్య వద్ద వంతల బాలయ్య అలియాస్ సాలును హత్య చేసిన సంఘటన లో పాల్గొంది.2015 సంవత్సరంలో కొయ్యూరు మండలం, తీగలమెట్ట వద్ద ఎదురుకాల్పులు సంఘటనలో పాల్గొంది. 2015 సంవత్సరంలో ఒడిస్సా రాష్ట్రం, చిత్రకొండ పీఎస్ పరిధి పగలరేవు వద్ద ఎదురుకాల్పులు సంఘటనలో పాల్గొంది. 2018 సంవత్సరంలో ఒడిషా రాష్ట్రం, చిత్రకొండ పిఎస్, టెక్కరపాడు వద్ద ఎదురుకాల్పుల సంఘటన లో పాల్గొంది. 2019 సంవత్సరంలో తూర్పుగోదావరి జిల్లా గుర్తెడు పీఎస్ పరిధి చొప్పకొండ వద్ద ఎదురుకాల్పుల సంఘటనలో పాల్గొంది. 2014వ సంవత్సరంలో కొయ్యూరు మండలం, పలకజీడి వద్ద ట్రాక్టర్ ను ధ్వంసం చేసిన సంఘటనలో పాల్గొంది. 2015 సంవత్సరంలో వీరవరం గ్రామంపై కరువుదాడి సంఘటనలో పాల్గొంది. 3.కీల్లో రెల్లీ అలియాస్ దుర్గా, 34 సంవత్సరాలు, కంఠ వరం గ్రామము, బూసిపుట్టు పంచాయతీ, ముంచింగ్ పుట్ మండలము, 2005 నుండి 2017 మిలీషియా గాను, 2017 నుండి 2018 వరకు దళం మెంబర్ గా పెదబయిలు దళం లో పనిచేసాడు. ఇతనిపై రూ. 1 లక్ష రివార్డు కోసం ప్రభుత్వానికి పంపించడం జరిగింది .

### పాల్గొన్న నేరాలు

2008వ సంవత్సరంలో ముంచింగిపుట్టు మండలం, బక్కలపుట్ గ్రామం వద్ద పాంగి కృష్ణారావును హత్య చేసిన సంఘటన లో పాల్గొన్నాడు. 2010వ సంవత్సరంలో పెదబయలు మండలం, సుల్తాన్ పుట్ గ్రామం వద్ద కిల్లో మోహన్ ను హత్య చేసిన సంఘటన లో పాల్గొన్నాడు. 2016 సంవత్సరంలో ముంచంగిపుట్టు మండలం, బూసిపుట్ గ్రామం పాంగి శివయ్య ను హత్య చేసిన సంఘటన లో పాల్గొన్నాడు. 2016 సంవత్సరంలో చిత్రకొండ పీఎస్ పరిధిలో రామ గృహ వద్ద జరిగిన ఎదురు కాల్పు ల్లో సంఘటనలో పాల్గొన్నాడు. 2018 సంవత్సరంలో చిత్రకొండ పీఎస్ పరిధిలో జుడుంబా వద్ద జరిగిన ఎదురు కాల్పుల్లో సంఘటనలో పాల్గొన్నాడు. 2018 సంవత్సరంలో చిత్రకొండ పీఎస్ పరిధిలో టిక్కరపాడు వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో సంఘటనలో పాల్గొన్నాడు. 2009వ సంవత్సరంలో ముంచంగిపుట్టు మండలం, లక్ష్మీపురం వద్ద రోడ్డు యంత్రాలను కాల్చివేసిన సంఘటనలో లో పాల్గొన్నాడు. 2010వ సంవత్సరంలో ముంచంగిపుట్టు మండలం, బంగారుమెట్ట గ్రామం వద్ద బస్సును కాల్చివేసిన సంఘటనలో పాల్గొన్నాడు. 2014వ సంవత్సరంలో పెదబయలు మండలం దాకిరేవు గ్రామము వద్ద బస్సును కాల్చివేసిన సంఘటనలో పాల్గొన్నాడు. 10. 2014వ సంవత్సరంలో ముంచంగిపుట్టు మండలం, బూసీ పుట్ వద్ద జీపును కాల్చివేసిన సంఘటనలో పాల్గొన్నాడు. బ్యానర్లు,పామ్ ప్లేట్లులను బుసిపుట్ ,రూడకోట ,బంగారుమెట్ట, లక్ష్మీపురం మరియు బెజ్జంకి వద్ద వేసిన సంఘటనలో పాల్గొన్నాడు. 1కంఠవరం వద్ద స్థూపాన్ని నిర్మించడంలో పాల్గొన్నాడు. వంతల బాబురావు, తండ్రి: సోమయ్య, 30 సంవత్సరాలు, జుమడి గ్రామము, పెదబయలు మండలం, 2010 నుండి 2019 వరకు మిలీషియా పాకెట్ కమిటీ మెంబర్, పెదబయిలు దళం లో పనిచేశాడు. పాల్గొన్న నేరాలు 2010వ సంవత్సరంలో లో దగ్గుడుపల్లి వద్ద భాస్కర్ ను హత్య చేసిన సంఘటన లో పాల్గొన్నాడు. 2017 సంవత్సరంలో సూర్యం, కిశోర్ లను హత్య చేసిన సంఘటన లో పాల్గొన్నాడు. ఒడిస్సా రాష్ట్రంలో జనతాపాయ గ్రామం వద్ద హోంగార్డ్ జగ్గారావు ను హత్య చేసిన సంఘటన లో పాల్గొన్నాడు. ఒరిస్సా రాష్ట్రం సింగవరం గ్రామం వద్ద ఆనంద్ ను హత్య చేసిన సంఘటన లో పాల్గొన్నాడు. ఒడిస్సా రాష్ట్రంలో చిట్టంచిలుక గ్రామం వద్ద రాంబాబు ను హత్య చేసిన సంఘటన లో పాల్గొన్నాడు. మరియు 3 ఎదురు కాల్పులు సంఘటనలు మరియు కరువు దాడులులలో పాల్గొన్నాడు. . కొర్ర శివ తండ్రి: ఆనందరావు, 19 సంవత్సరాలు, కొందు,ననుభారీ గ్రామం,ఇంజరి పంచాయతీ, పెదబయలు మండలం 2016 నుండి 2019 వరకు పెదబయిలు దళంలో మిలీషియా మెంబర్ గా పని చేశాడు. పాల్గొన్న నేరాలుః 2017 సంవత్సరంలో పెదబయలు మండలం, జక్కం మరియు ననుభారీ వద్ద రెండు మందు పాతర్లను పేల్చి, పోలీస్ పార్టీ పై కాల్పులు జరిపిన సంఘటనలో పాల్గొన్నాడు. 2019 సంవత్సరంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన ఎన్నికల వ్యతిరేక మీటింగ్ లో పాల్గొన్నాడు. . కొర్ర సుబ్బాలి, అలియాస్ సుందరి అలియాస్ అలకనంది , 19 సంవత్సరాలు, తండ్రి: బాబురావు, కొందు, ననుభారీ గ్రామం, పెదబయలు మండలం, 2013 నుండి 2019 వరకు పెదబయిలు మిలీషియా మెంబర్ గా పనిచేసింది. పాల్గొన్న నేరాలుః . 2015 సంవత్సరంలో జి.మాడుగుల మండలం గుదలవీధి ఆశ్రమంపై దాడి చేసిన సంఘటనలో పాల్గొన్నది. భూటారి నూకరాజు, తండ్రి : రమణ 38 సంవత్సరాలు, తర్రాల్ గ్రామము , జి.మాడుగుల మండలం . 2010 నుండి 2019 వరకు మీలీషియో మెంబర్ గా పని చేశాడు. పాల్గొన్న నేరాలు 2010 వ సంవత్సరంలో జి.మాడుగుల మండలం చెర్రాల్- రసరాయి వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో సంఘటనలో పాల్గొన్నాడు.

మావోయిస్టులు బలవంతంగా పార్టీలో చేరమని భయపెట్టడం వలన మరియు పాంగి తలో, వంతల మంగమ్మలు చిన్న తనంలో పెళ్ళి కోసం తల్లిదండ్రులు బలవంతం చేయడం వలన అది నచ్చక మావోయిస్టులుతో కలిశారు. ముఖ్యంగా పై వారందరూ మావోయిస్టుల మాటలకు పాటలకు ప్రభావితమై పార్టీలో చేరినట్లు రేంజ్ డీఐజి తెలిపారు.

# వైకాపా సీనియర్ నాయకుల ఆత్మీయ సమావేశం



భీమునిపట్నం: విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలం అమనాం లో వైకాపా సీనియర్ నాయకులు,కార్యకర్తలు ఆత్మీయ సమావేశం జరిగింది.మరగడ రఘురామరెడ్డి అద్వర్యంలో జరిగిన సమావేశానికి పిఎసిఎస్ మాజీ అద్యక్షులు దంతులూరి సూర్యనారాయణ రాజు హాజరయ్యారు. దివంగత మాజీముఖ్య మంత్రి రాజశేఖరరెడ్డి మరణాంతరం షర్మిల పాదయాత్ర లో అమనాం గ్రామం నుండి కీలకపాత్ర పోషించారు.నాటి నుండి నేటివరకు ప్రతిఒక్కరి సామాన్యుని కనీస అవసరాలు రేషన్, ఆదార్,కార్డులు,ె వెన్యూ,పోలీస్, కుటుంబ కలహాలు,ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తూ మేమున్నామని భరోసా కల్పిస్తూ అదికారం లేకపోయినా ముందుకు సాగుతున్నామని అదికారంలోకి వచ్చాక పార్టీ తమను గుర్తించ కుండా ప్రజలకు అందుబాటులోలేని, సమస్య లపై కనీస అవగాహణలేని వ్యక్తికి ప్రాదాన్యతని కల్పించడంతో మండిపడుతున్నారు. భవిష్యత్తు కార్యాచరణకు 200 మందితో సమావేశం నిర్వహించారు. తమకు ప్రాదాన్యత లేకపోతే ప్రజలోకి వెళ్ళి విజయం సాదిస్తామని అన్నారు. కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకుల్లు గొర్సు రమణ,కంబపు శివకుమార్,వేమల శ్రీనివాసు,కొల్లి నర్సిమ్మ,మరగడ గౌరి, చుక్క రమణ తదితరులు పాల్గొన్నారు.

## కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# విద్యార్థులకు బస్‌పాస్‌లు పంపిణీ



భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ వారి సహకారంతో భీమిలీ లో ఉన్న సమీకృత సంక్షేమ బాలిక విద్యార్థినులకు సుమారు 200 మంది విద్యార్థులకు ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో, ఆర్టీసీ వాల్తేర్ డిపో మేనేజర్ గంగాధర్ ,మరియు సిబ్బంది ఎల్ బాల మురళికృష్ణ, వి అప్పలరాజు, లు పాస్ లు జారీ చేసారు. వాటిని ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీ రామ చంద్ర మూర్తి ( శ్రీ రామ్) మంగళవారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కలిగొట్ల భానోజిరావు, శ్రీనివాసరావు, సూర్య నారాయణ మూర్తి, మొకర శంకర్, రాము, ఉడికల శ్రీను, రాంబాబు, లక్ష్మణ రావు, తదితరులు పాల్గొన్నారు.

# భీమిలిలో ఘనంగా కుంబుమాంబ అమ్మవారి మహోత్సవాలు



భీమునిపట్నం: స్థానిక. బ్యాంక్ కోలని లో ఉన్న కుంచ మాంబ అమ్మవారి మహోత్సవాలు సందర్భంగా మంగళవారం అనుపు మహోత్సవం ఘణంగా జరిగింది. ఆలయం లో ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శించు కున్నారు .ఉదయం భీమిలీ మాజీ ఎంపిపి యరభాల అనిల్ ప్రసాద్ కృష్ణవేణి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.బుదవారం అమ్మవారికి పసుపు కుంకమ పూజలు నిర్వ హిస్తామని అలాగే ఉత్సవాల లో పలు సంస్కృతి కార్య క్రమాలు నిర్వహిస్తున్నా మని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

# సి యం జగన్ పాలన చరిత్రలో నిలిచిపోతుంది



గాజువాక: వైకాపా ప్రభుత్వం అందిరికీ ఆమోదోగ్యమైన పాలనను అందిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేస్తూ సుపరిపాలన అందించడం ఏపీ ప్రజల అదృష్టమని, ఏపి ముఖ్యమంత్రి వైయస్‌జగన్ పాలన చరిత్ర సృష్టిస్తుందని గాజువాక వైకాపా శ్రేణులు పేర్కొన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల ప్రకారం ఎస్సీ,ఎస్టీ లకు 50శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు ప్రకటన చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలను తెలిపారు. ఎస్సీ సెల్ నాయకులు మార్డపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి ఆధ్వర్యంలో గాజువాక మండల కార్యాలయం ఎదురుగా అంబేద్కర్ విగ్రహం సమీపం వద్ద జగన్ ప్లెక్సీకి మంగళవారం క్షీరాభిషేకాన్ని నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, బిసీ మైనార్టీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ రిజర్వేషన్‌తో వెనుకబడిన వర్గాలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అవినీతిరహిత పాలనను అందిస్తూ, ప్రజాభిప్రాయమేరకు నడుచుకూంటూ ముందుకు సాగుతున్న జగన్ పాలనకు తిరుగులేదని, రానున్న కాలంలో కూడా వైయస్ఆర్ ప్రభుత్వమే ఏపీలో కొనసాగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో వైకాపా బీసి, ఎస్సీ, ఎస్టీ నాయకులు మాటూరి శ్రీనివాసరావు, కె.దేముడు, ఎం.వెంకటేష్, పి.రాజా, కటికల కల్పన, శ్యామ్, బచ్చుల త్రిమూర్తులు పిట్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీకుంఛమాంబ శ్రీపోలమాంభ అమ్మవార్ల పండుగ



సింథియా: పారిశ్రామిక ప్రాంతం జీవీయంసీ 46వ వార్డు గుల్లలపాలెం గ్రామంలో వేంచేసిన శ్రీకుంఛమాంభ, శ్రీపోలమాంభ అమ్మవార్ల పండుగ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడురోజులుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో గ్రామస్తులు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేకపూజలు, కుంకుమ పూజలను నిర్వహించారు. మంగళవారం అనుపు కార్యక్రమాన్ని ఆలయ కమిటీ గ్రామ పెద్ద రఘు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ ప్రతీ మూడెళ్ళకొకసారి గ్రామకమిటీ ఆద్వర్యంలో ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితాగా వస్తుందని అన్నారు. ఈ సారి 5సం. కొకసారి నిర్వహించడం జరిగిందని అన్నారు. ఎన్నోఏళ్ళుగా గ్రామ దేవతలుగా అమ్మవార్లు పూజలు అందుకుంటున్నారని, అమ్మవారిని దర్శించితే కోరిన కోర్కెలు తీరుతాయని గ్రామస్తుల నమ్మకమని అన్నారు. పండుగ మూడురోజులు అనేక సాంస్కృతిక, నేల, బుర్రకథలు ఏర్పాటు చేసామని తెలిపారు. అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్ళి అత్యంత వైభవంగా అనుపు కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం రాకుండా అన్నిఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం గ్రామపెద్ద రఘు, బర్రితాతారావులు చేసిన సేవలను కొనియాడుతూ వారికి సేవలకు గుర్తింపుగా వైకాపా నేత ఉద్దాభాస్కరావు ఆద్వర్యంలో వారికి చిత్రపటాలనిచ్చి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పలపాలపద్మ, తెప్పల నర్సింగరావు, రమణ, కలపోరాటం ఎడిటర్ శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత పాటించిన సంస్థలకు

# స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల బహుకరణ



**జివియంసి పరిధిలో స్వచ్ఛత పాటించిన సంస్థలకు అవార్డులు**
**స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రదానం**
**8 జోన్లకు చెందిన 48 మందికి బహుకరణ**
**స్వచ్ఛ సర్వేక్షణ్ నిబంధనలు పాటించిన వారికి ప్రదానం**
**పరిసరాల పరిశుభ్రత, ఉత్తమ ప్రాక్టీసులకు ప్రోత్సాహం**
**ఏ.బి.సి ర్యాంకులలో ఏ ర్యాంక్ సాధనకు దోహదపడాలి**
**జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన**









విశాఖపట్నం: జివియంసి పరిధిలోని 8 జోన్లకు చెందిన 48 సంస్థలకు స్వచ్ఛత పాటించినందుకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రదానం చేసినట్లు కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో (సోమవారం సాయంత్రం) హెూటల్స్, మార్కెట్ అసోసియేషన్లు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఆసుపత్రులు, ఆఫీసులు/ పాఠశాలలకు స్వచ్ఛత అవార్డులు ప్రదానం గావించారు. స్వచ్ఛత పాటించి పరిసరాల మెరుగుదలకు కృషి చేసిన సంస్థలకు అవార్డులు ప్రదానం గావించినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛత అవార్డులను ప్రతి సంవత్సరం ప్రదానం చేస్తున్నట్లు వెల్లడించారు.

8 జోన్లకు చెందిన 48 మందికి ప్రోత్సహంగా స్వచ్ఛత అవార్డులకు ఎంపిక చేసినట్లు వివరించారు. పరిసరాల పరిశుభ్రత, ఉత్తమ ప్రాక్టీసులను అమలు చేస్తున్న వారికి ప్రోత్సహించడానికి దోహదపడతుందని అభిప్రాయ పడ్డారు. ఏ ర్యాంక్ సాధించిన వారికి అవార్డులు బహుకరించినట్లు వివరించారు.

స్వచ్ఛ సర్వేక్షన్ 2020 లో ఉత్తమ ర్యాంక్ సాధించడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇదే స్ఫూర్తితో జివియంసి, ప్రజలు, పారిశుద్ధ్యకార్మికులు భాగస్వామ్యంతో ఉత్తమ ర్యాంక్ సాధనకు ఉపకరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమ ంత్, అదనపు కమిషనర్ (జనరల్) ఏ.వి.రమణి, సిసిపి విద్యుల్లత, యస్.ఇ లు ప్రసాదరాజు, శ్యాంసన్‌రాజు, పల్లంరాజు, మరియన్న, ఏడిహెచ్ దామోదర్, అందరు ఇఇలు, జోనల్ కమిషనర్లు, ఏ.యం.ఓ.హెచ్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, హెూటల్స్, మార్కెట్ అసోసియేషన్లు, ఆర్.డబ్ల్యు.ఏ, ఆసుపత్రులు, ఆఫీసులు పాఠశాలల ప్రతినిధులు హాజరైనారు.

# బైకులు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు దుర్మరణం



గాజువాక: రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు అక్కడిక్కడే దుర్మరణం పాలైయ్యారు. గాజువాక సుందరయ్యకాలనీ వద్ద మంగళవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం......గంగవరం ప్రాంతానికి చెందిన వాడపల్లి కోటి ద్విచక్రవాహనం పై సుందరయ్య కాలనీ వైపు వస్తున్నాడు. ఆదే సమయంలో ఎదురుగా వస్తున్న మరోబైకిస్టును సుందరయ్యకాలనీ దగ్గర ఎదురెదురుగా ఢీకొనగ ఈ సంఘటనలో వాడపల్లి కోటికి తలకు తీవ్రగాయాలవ్వడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. మరోబైకిస్టుకు స్వల్ప గాయాలయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న గాజువాక పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించగా మరోవ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. గాజువాక సి.ఐ.కోరాడరామారావు పర్యవేక్షణలో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఈ నెల 25న రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలు ఏబివిపీ ఆధ్వర్యంలో బంద్

భీమునిపట్నం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్. ఏ బి వి పి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 25 న జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలను బంద్ ప్రకటిస్తున్నా మని ఏ బివిపి జిల్లా కన్వనర్ లొడగల అచ్చిబాబు తెలిపారు.

# ఉపాధ్యాయునికి సన్మానం



పరవాడ: పిట్టవానిపాలెం గ్రామంలో పని చేస్తున్నటువంటి మాస్టర్ కనకరాజు మన స్కూల్ నుండి బదిలీ మీద వేరే హై స్కూల్ కి వెళ్ళిపోతున్న సందర్భంగా గ్రామ ప్రజలు కమిటీ సభ్యులు అలాగే స్కూల్ ఉపాధ్యాయులు కలిసి మాస్టర్ గారికి సన్మాన కార్యక్రమం జరగ బడింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిత్రులందరికీ పిట్టవానిపాలెం గ్రామాభివృద్ధి కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేసారు.

# ప్రభుత్వ పాఠశాలలో క్రీడాస్ఫూర్తిని పెంచాలి



భీమునిపట్నం: తగరపువలస వుయ్ కేర్ యు మరియు హెల్పింగ్ హేండ్స్ వారి ఆధ్వర్యంలో ఆశిని రియల్ ఎస్టేట్ అధినేత లైన్ వర్మరాజు ఆర్థిక సహాయం తో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో క్రీడా స్ఫూర్తిని పెంచాలనే ముఖ్య ఉద్దేశ్యం తో బాలురకు క్రికెట్ , బాలికలకు కబాడి నిర్వహించారు ఈ క్రీడలలో చిట్టివలస బాయ్స్ మరియు గర్ల్స హైస్కూల్ అంబేద్కర్ స్కూల్ , భీమిలి మున్సిపల్ హై స్కూల్ , నెహ్రూ హైస్కూల్ మరియు తాళ్ళవలస హైస్కూల్ పాల్గన్నాయి వీరికి విన్నర్స్ మరియు రన్నర్స్ ట్రోపీలు మన ఆశిని వర్మ అందజేస్తారు ఈ కార్యక్రమం లో వుయ్ కేర్ యు వెంపాడ శ్రీనివాసరెడ్డి , అన్ని స్కూల్ పి .ఇ. టి లు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాంపై ఆకస్మిక దాడులు

గొలుగొండ : మంగళవారం కేడిపేట గ్రామంలో వెంకటేశ్వర ట్రేడర్స్‌పై వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. నర్సీపట్నం ఏడిఎ మోహనరావు, ఏఒ మధుసూధనరావు ఆధ్వర్యంలో దాడులు చేసి రికార్డులు పరిశీలించారు. ఈ పరిశీలనలో యాజమాని నానిబాబు సూపర్ పాస్పేట్, అమ్మోనియా సల్ఫేట్‌కు చెందని ఓ ఫారం లేకుండా అమ్మకాలు జరిగినట్లు గుర్తించారు. 2.70లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలు వెంటనే నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రికార్డులు సీజ్ చేసినట్లు ఎడిఎ తెలిపారు. బిల్లులు సక్రమంగా ఉండాలని, ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు జరగకూడదని ఆయన తెలిపారు. ప్రతీ గ్రామంలో ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై దాడులు చేస్తామని హెచ్చరించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# నారుమడులను పరిశీలించి తీసుకోవాలి

గొలుగొండ : మండలంలో చోద్యం గ్రామంలో మంగళవారం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వి.మోహనరావు పాల్గొని మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలు అయినందున నారుమడులను పరిశీలించి తీసుకోవాలని వివరించారు. ప్రస్తుతం నారుమడులలో పొడ తెగులు అధికంగా ఉండటం వలన హెక్సకొనజోల్ అను తెగులు మందును 2ఎంఎల్ మందును ఒక లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వరి చెరకు పంటలకు బీమా కోసం మీసేవలో ఒక రూపాయి చెల్లించి బీమాను వర్తింపజేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల వ్యవసాయాధికారి టి.మధుసూధనరావు, ఎఇఒలు వివిఎస్.సురేష్‌కృష్ణ, జి.రాజారావు, ఎంపిఇఒలు గురుప్రియ, జి.వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

# ఐదేళ్లుగా వెక్కిరిస్తున్న ఐఐఎం శిలాఫలకం

- గ్రాఫిక్స్‌కు అందని ఐ ఐ ఎం
- కలగా మిగిలిన ఐఐఎం విద్యా సంస్థ
- ఐదేళ్ల క్రితమే హడావుడి గా ఐఐఎం శంకుస్థాపన
- 150 మంది రైతుల నుంచి సుమారుగా 500 ఎకరాల సేకరణ
- భూమి పూజ చేసిన అప్పటి కేంద్ర విద్యా శాఖ మంత్రి స్మృతీ ఇరానీ
- కాంపౌండ్ వాల్ కే పరిమితమైన క్యాంపస్
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు
- కానరాని నిర్మాణం - కనికరించని ప్రభుత్వం
- తాత్కాలిక గదుల్లో మగ్గుతున్న విద్యార్థులు
- విద్యార్థులకు ప్రశ్నార్థకంగా మారిన ప్రపంచ స్థాయి బోధన
- మంత్రి ఇలాకాలోనే అభివృద్ధికి నోచుకోని ఐ.ఐ.ఎం







మధురవాడ : ప్రపంచ స్థాయి బోధన అందించే ఐఐఎం పూర్తి స్థాయిలో నిర్మాణం ఇంకా కొనసాగకపోవడంతో విద్యార్థులు తమ భవిష్యత్ పై ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా విశాఖలో ఐఐఎం ఏర్పాటు కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన అప్పటి బిజెపి ప్రభుత్వం 2015 లో ఐఐఎం ఏర్పాటు కు శంఖుస్థాపన చేసింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలసి కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ పరిధిలో గల 480 ఎకరాల లో ఐఐఎం నిర్మాణం కోసం అట్టహాసంగా భూమి పూజ చేశారు. అప్పటి రాష్ట్ర మంత్రి,భీమిలీ నియోజకవర్గ ఎమ్మెల్యే గా ఉన్న గంటా శ్రీనివాసరావు ఐఐఎం నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ పద్దతిలో రూ.17 కోట్ల రూపాయల పరిహారం వెచ్చించి 150 మంది రైతుల వద్ద నుంచి 480 ఎకరాల భూమిని సేకరించారు. ఐఐఎం యూనివర్సిటీ నిర్మాణం కోసం కావాలిసిన భూమి కంటే ఎక్కువ భూమినే రైతులను బెదిరించి అడ్డగోలుగా సేకరించారు. ఇదిలా ఉండగా ఈ యూనివర్సిటీ ని 2021 కల్లా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో కి తీసుకు వస్తామని కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ ప్రకటించడం కూడా జరిగింది. కానీ ఇప్పటి వరకు ఐఐఎం క్యాంపస్ కాంపౌండ్ వాల్ తప్ప పూర్తి స్థాయి నిర్మాణం అయితే సాగలేదు, దీంతో విద్యార్థులు తాత్కాలిక గదుల్లో మగ్గవలిసిన పరిస్థితులు నెలకొన్నాయి, కాంపౌండ్ వాల్ కి మాత్రమే పరిమితమైన ఐఐఎం నిర్మాణం పూర్తి అయ్యేది ఎప్పుడు, విద్యార్థులకు పూర్తి స్థాయిలో విద్యా బోధనలు చెప్పేది ఎప్పుడా అని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే ఐఐఎం పేరుతో విద్యార్థుల జీవితాలతో ఆటలు అడుతున్నట్లే ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయి కానీ విద్యార్థుల తల రాతలు మాత్రం మారలేదు. విభజన అనంతరం రాష్ట్రానికి కేటాయించిన యూనివర్సిటీలలో విశాఖ ఐఐఎం ఒకటి, విభజన హామీల మేరకు ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఇంకా పూర్తి నిర్మాణం కాకపోవడం పై మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2021 కల్లా నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందు బాటులోకి తెస్తామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి ఏళ్ళు గడుస్తున్నా ఇంత వరకు నిర్మాణం చేపట్టక పోవడం విడ్డూరంగా ఉందని వారు పేర్కొం టున్నారు. టిడిపి హయాంలో భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన గంటా శ్రీనివాసరావు ఐఐఎం ను నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ పద్దతిలో రైతుల నుంచి అడ్డగోలుగా తన అనుచరగణంను అడ్డుపెట్టుకొని 480 ఎకరాలు సేకరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి, కావలసిన దానికంటే పెద్ద మొత్తంలో భూమిని సేకరించడంతో అనేక విమర్శలు సైతం ఎదుర్కొన్నారు, ఇప్పుడు ఐఐఎం ఏర్పాటు కోసం రైతుల వద్ద నుంచి సేకరించిన భూముల విషయంలో ను పెద్ద స్కామ్ జరిగిందనే వార్తలు కూడా గుప్పుమన్నాయి. భూముల సేకరణ విషయంలో వస్తున్న ఆరోపణల పై అప్పటి టిడిపి ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు కానీ కొంతమంది రైతులు మాత్రం తమ వద్ద నుంచి అన్యాయం గా భూములను లాక్కున్నారని ఆందోళన సైతం చేసారు, రాజకీయ చతురుడుగా పేరుగాంచిన గంటా అధికార బలంతో అణిచివేశారని ఆరోపణులు గుప్పుమన్నాయి, ఇదిలా ఉండగా 2015లో ఇక్కడ ఐఐఎం ఏర్పాటు కు భూమి పూజ చేసి అనంతరం కాంపౌండ్ వాల్ నిర్మించి వదిలేసిన కేంద్ర ప్రభుత్వం పైన కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వం పై వచ్చిన ఆరోపణల పై అలాగే రాజకీయ పరిణామాల వలన కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి విషయంలో అశ్రద్ధ చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారింది జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైకాపా ప్రభుత్వం ఏర్పడింది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పట్ల మంచి అభిప్రాయం తో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటి కైనా విశాఖలో ఐఐఎం నిర్మాణానికి పూర్తిగా సహకరించి త్వరితగతిన పూర్తి చేయడానికి అన్ని విధాలా తోడ్పాటునందించాలని పలువురు కోరుతున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐఐఎం విషయంలో కేంద్రం పై ఒత్తిడి తీసుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అయోమయంలో ఉన్నత చదువులు**

విశాఖలో ఏర్పాటు చేసిన ఐ.ఐ.ఎం లో చేరిన విద్యార్థులు అయోమయంలో పడ్డారు ఆంధ్ర యూనివర్సిటీ లో ఏర్పాటుచేసిన తాత్కాలిక భవనంలో చాలీచాలని గదుల్లో తమ విద్యాభ్యాసాన్ని పూర్తి చేస్తున్నారు ప్రపంచ స్థాయి బోధన అందిస్తామని విద్యార్థుల నుంచి లక్షల్లో వసూలు చేసి ఆ స్థాయిలో విద్యా అందక విద్యార్థులు సతమతమవుతున్నారు సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయాల్సినవి ఉన్నత చదువుల ప్రమాణాలు ఆ స్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు కలత చెందుతున్నారు,గ్రూప్ డిస్కషన్స్ ,సెమినార్ హాల్స్, లైబ్రరీ, ప్రాక్టికల్ రూమ్స్, స్పోర్ట్స్ ఏరియా, విశాలవంతమైన అకామిడేషన్, చక్కటి కాఫ్టేరియా, వర్చ్యువల్ క్లాస్ రూమ్స్ వంటివి ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆంధ్ర యూనివర్సిటీ లో ఉన్నటు వంటి ఐఐఎం లో లేకపోవడంతో విద్యార్థులు ఆ స్థాయిలో రాణించలేకపోతున్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తక్షణమే నిర్మాణానికి కావలసిన ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరుతున్నారు. భీమిలి నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా మంత్రి ముత్తంశెట్టి శ్రీనువాసు ఆయన పరిధిలో ఉన్న ఐ.ఐ.ఎం నిర్మాణం పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజా సంఘాలు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నాయి.

దోనుబాయి పోలీస్టేషన్ పరిధిలో

## మందుపాతర స్వాధీనం



శ్రీకాకుళం: పోలీసులు, ప్రజా ప్రతినిధులు లక్ష్యంగా మందుపాత్రను ఏర్పాటు చేసినట్టు జిల్లా పోలీసు సుపరింటెండెంట్ ఆర్. ఎన్. అమ్మిరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం ఎస్. పి. కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబట్టిన మా సమాచారం మేరకు సీతంపేట మండలం దోనుబాయి పోలీస్టేషన్ పరిధిలో పి.డి.టీమ్తో కలసి వెల్లినప్పుడు మారుమూల అటవీ ప్రాంతంలో కుంబింగ్ చేసినప్పుడు అనుమాన ప్రదేశం కనిపించింది. అక్కడ అనుమానం వచ్చి పి.డి. చెక్ చేసినప్పుడు వచ్చిన సిగ్నల్స్ ఆధారంగా ఆప్రాంతం మరింత తరువుగా పరిశీలించినప్పుడు 6 లాంట్ మైన్స్ తో పాటు నాటు తుపాకి డంపు రూపంలో భూమిలో పాతిపెట్టినట్టు గుర్తించడం జరిగిందని తెలిపారు. వీటిని టెక్నికల్ టీమ్ వారు చాకచక్యంగా నిర్వీర్యంచేసి వాటిలో ఉన్న డెడిటేర్స్ ను వేరుచేయడం జరిగిందన్నారు. వాటిని పరిశీలించగా అందులో జెల్ ఎక్స్ప్లొజు లభ్యమైనట్టు చెప్పారు. దాంతోపాటు సర్ఫర్, బోల్ట్ అండ్ నట్స్, గాజు పెంకులు ఉన్నాయని తెలిపారు. పోలీసు కుంబింగ్ ను టార్గెట్ చేసి ఈ లేండ్ మైన్స్ పాతిపెట్టినట్టు చెప్పారు. ఇది పబ్లిక్ కి అందుబాటులో లేని ప్రాంతమని చెప్పారు. ఎప్పుడైనా మావోయిస్టులు వాటిని తీసుకోని వచ్చి వాడుకోవడానికి దాచిపెట్టినట్టు తెలిపారు. దీనికి సంబంధించి దోనుబాయి పోలీసు స్టేషన్ లో కేసు రిజిష్టరు చేసి, మావోయిస్టులతో సంబంధాలు ఉన్నవారి సమాచారం సేకరించి వారిపై ఎఫ్.ఐ.ఆర్. వ్రాయడం జరుగుతుందన్నారు. నాటు తుపాకీ కూడా వర్కింగ్ కండిషన్ ఉందని చెప్పారు. ఇవి ఆరు లేకా ఏడు సంవత్సరములు క్రితము పాతిపెట్టినట్టు గుర్తించడం జరిగిందన్నారు. పోలీసు టీమ్‌లో కష్టపడి పనిచేసిన వారికి రివార్డులు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు కూడా ఇట్లాంటివి జరగకుండా వ్యతిరేకించి పోలీసులకు సహకరించాలని కోరారు. దీనికి సంబంధించిన ఫ్లెక్సీలు కూడా జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్స్ మరియు మండల కేంద్రాలు వద్ద డిస్ప్లే జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాలకొండ డి.ఎస్.పి. రాధాప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి. పి.వి. క్రిష్ణవర్మ, స్పెషల్ బ్రాంచ్ సి.ఐ. ఎమ్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విశాఖ శారదా పీఠం రిషికేశ్ ఆశ్రమంలో భక్తిశ్రద్ధలతో ఉత్తరాధికారి స్వామి స్వాత్మానందేంద్ర సరస్వతి పీఠార్చన

## ముడశర్లోవకు మహర్దశ

19 కోట్లతో మొదటి దశ పనులు
సందర్శకులను ఆకట్టుకునేలా సుందరీకరణ
శంకుస్థాపనకు ముఖ్యమంత్రి రాక
విఎంఆర్డిఏ చైర్పర్సన్ ద్రోణంరాజు



సందర్శకులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేసేందుకు ముడసర్లోవ పార్కు సుందరీకరణకు రూపొందించిన ప్రణాళికను చూస్తున్న వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు, జివిఎంసి అధికారులు

విఎంఆర్డిఏ: ముడశర్లోవ ప్రాజెక్టును సందర్శకులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలని విఎంఆర్డిఏ చైర్పర్సన్ ద్రోణంరాజు శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు. పచ్చదనానికి విఘాతం కలగకుండా అభివృద్ధి పనులు చేయాలని, ఈ అభివృద్ధి పనుల వలన ఒక్క చెట్టుకు కూడా నష్టం వాటిల్లకూడదని స్పష్టం చేశారు. మంగళవారం చైర్పర్సన్ ద్రోణంరాజు ముడ శర్లోవ , కైలాసగిరి ప్రాంతాలను జీవీఎంసీ, వి ఏం ఆర్ డి ఏ కమిషనర్ సృజన, ఇంజినీరింగ్ అధికారులతో కలసి సందర్శించారు. ముడశర్లోవ పార్క్ అభివృద్ధి పనుల పై చైర్ పర్సన్ కు అధికారులు వివరించారు. ఈ అభివృద్ధి పనులను 50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నట్లు, అందులో తొలి దశ లో 19 కోట్లతో మౌలిక వసతుల కల్పన, ముఖ ద్వారం, అంఫీ థియేటర్, ప్లే అరెనా, హోటేల్స్, అంతర్గత రహదార్లు తదితర సౌకర్యాలను కల్పించనున్నట్లు అధికారులు వివరించారు. సెంట్రల్ పార్క్ ను తలపించాలి: ముడశర్లోవ పార్క్ సెంట్రల్ పార్క్ ను తలపించేలా అభివృద్ధి చేయాలని, పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులకు చైర్ పర్సన్ సూచించారు. పర్యాటక, పరిశ్రమల పరంగా, ఐ.టి,ఇతర రంగాల అభివృద్ధి లో విశాఖపట్నం దేశం లోనే ఉన్నతంగా ఉండేలా చూడాలని సి.ఎం జగన్ మోహన్ రెడ్డి భావిస్తున్నారని, అందుకుల తగ్గట్టుగానే మన ప్రణాళికలు ఉండాలని అన్నారు. ముడశర్లోవ అనేది చరిత్రాత్మక పర్యాటక ప్రదేశమని, ఆధునీకరణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి గారితో శంకుస్థాపన చేయించాలని యోచిస్తున్నామని తెలిపారు. తొలిదశ పనులకు సమగ్రంగా ప్రణాళికలు తయారుచేసి టెండర్లను త్వరగా పిలవలని అధికారులకు సూచించారు. ఈ పనులను జీవీఎంసీ, వి ఎం ఆర్ డి ఏ సామాన్యంతో చేపట్టాలని, నిర్వహణ బాధ్యతలను జీవీఎంసీ చూడాలని అన్నారు. *కైలాసగిరి పై కంట్రోల్ రూం :* కైలాసగిరి సందర్శనకు అనేక మంది సందర్శకులు వస్తు ఎప్పుడు రద్దీగా ఉంటున్న దృష్ట్యా ఒక కంట్రోల్ రూం ను ఏర్పాటు చేయాలని చైర్ పర్సన్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు సి సి కెమెరాలతో కూడిన నిఘా పెంచాలని, సందర్శకుల భద్రత కూడా ముఖ్యమేనని అన్నారు. విశాఖపట్నంకు కైలాసగిరి నే లోగో గా భావిస్తున్నారని, దీని విశిష్టతను ఏ మాత్రం తగ్గకుండా అదేవిధంగా పచ్చదనానికి విఘాతం కలగకుండా అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. తెలుగు *మ్యూజియం సందర్శన:* చైర్ పర్సన్ ద్రోణంరాజు తెలుగు మ్యూజియం ను సందర్శించారు. రివాల్వింగ్ డయాస్ పై కూర్చుని శాతవాహనుల కాలం నుండి ఆధునిక యుగం వరకు తెలుగు వారి చారిత్రక వైభవాన్ని చాయా చిత్ర, దృశ్య, శ్రవణ, ధ్వని ద్వారా క్యురేటర్ డా. చంద్రశేఖర్ వివరించగా ఆద్యంతం తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు మ్యూజియం సందర్శన మంచి అనుభూతినిచ్చిందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో సెక్రెటరీ ఏ.శ్రీనివాస్, ఎస్.ఈ రవి ఈఈ లు భవాని శంకర్, సతీష్ చంద్ర, అటవీ అధికారి రాజా రావు, డీ ఈ లు, జి వి ఎం సి అధికారులు అధికారులు పాల్గొన్నారు.



గన్నవరం విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్‌కు ఘనస్వాగతం పలికిన సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి , రాష్ట్ర మంత్రులు మేకతోటి సుచరిత, కొడాలి నాని, అదిమూలపు సురేష్ , మోపిదేవి వెంకరమణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం, ఏపి డీజీపీ గౌతమ్ సవాంగ్ , కృష్ణా జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, సీపీ ద్వారకా తిరుమలరావు, పలువురు ఉన్నతాధికారులు..



## బాలుడి కిడ్నాప్.. ఇంకా దొరకని ఆచూకీ!



మండపేట: తూర్పుగోదావరి జిల్లా మండపేట సమీపంలోని విజయలక్ష్మీ నగర్‌లో అపహరణకు గురైన బాలుడి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. సాయిధరణి అపార్ట్‌మెంట్ వద్ద జరిగిన అపహరణ ఘటన తీవ్ర కలకలం రేపింది. అపార్ట్‌మెంట్‌లో అమ్మమ్మతో పాటు వెళ్తున్న జశిత్ అనే ఐదేళ్ల బాలుడిని గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అపహరించారు. జశిత్ తల్లిదండ్రులిద్దరూ బ్యాంకు ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. కుమారుడి అపహరణపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ కోసం ఏడు బృందాలతో గాలిస్తున్నట్లు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం హస్మీ వెల్లడించారు. అన్ని చెక్‌పోస్టులు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో అప్రమత్తం చేశామన్నారు. అపహరణకు ఆర్థిక లావేదేవీలే కారణమనే కోణంలోనూ విచారిస్తున్నట్లు చెప్పారు.

## రెయిన్‌గన్‌ల ప్రయోగం విఫలం

అమరావతి : రెయిన్‌గన్‌లకు టెక్నికల్ సపోర్టు ఇవ్వడంలో గత ప్రభుత్వం విఫలమైందని పట్టణాభివ ృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం శాసనమండలిలో క్వశ్చన్ అవర్‌లో భాగంగా రెయిన్‌గన్‌లకు సంబంధించి మంత్రి మాట్లాడారు. 116 కోట్ల రూపాయలు వెచ్చించి గత చంద్రబాబు ప్రభుత్వం రెయిన్‌గన్‌లను కొనుగోలు చేసిందని తెలిపారు. కేవలం ఒక ఏడాది, ఒక సీజన్‌లో మాత్రమే వాటిని వినియోగించారని పేర్కొన్నారు. టెక్నికల్ సపోర్ట్ లేకపోవడం వల్లే రెయిన్‌గన్‌ల ప్రయోగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ సొమ్ము పూర్తిగా వ ృథా అయిందని మండిపడ్డారు. వీటి ద్వారా ఒక్క ఎకరాకు కూడా అదనపు సాగు జరగలేదని వెల్లడించారు. ఎవరైనా సభ్యులు అడిగితే రెయిన్‌గన్‌లపై విచారణకు ఆదేశిస్తామని స్పష్టం చేశారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com